విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 07 అక్టోబరు 2025   8 పేజీలు

అవినీతిమయం...మలేరియా విభాగం

- రాజకీయ అండదండలతో లక్షలు స్వాహా
- పీజిఆర్‌ఎస్ ఫిర్యాదుతో విచారణకు కలెక్టర్ ఆదేశం
- రోజులు గడుస్తున్నా చర్యలు శూన్యం

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : నగరపాలక సంస్థలో ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నది. రాజకీయ నాయకుల అండదండలతో లక్షల రూపాయలు ఉద్యోగులు స్వాహా చేస్తున్నారు. వీటన్నింటిపై దృష్టి సారించాల్సిన కార్పొరేషన్ ఉన్నతాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో సంబంధిత ఉద్యోగుల ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతుంది.. ఇందులో భాగంగానే నగరపాలక సంస్థలోని మలేరియా విభాగంలో జరిగిన అవినీతిపై ప్రస్తుతం చర్చనీయాంశం అవుతున్నది. ఏలూరు నగరంలో దోమల నివారణ కోసం ప్రత్యేకంగా ఒక మలేరియా విభాగాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షణ కోసం ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో దోమల నివారణ కోసం మిలాథిన్ కలిపిన మిశ్రమాన్ని ఫాగింగ్ చేస్తుంటారు. ఈ ఫాగింగ్ అత్యధికంగా జులై నెల నుండి ప్రారంభించి డిసెంబర్ నెల వరకు ప్రతి నిత్యం నగరంలోని మురికి వాడలు, దోమలు అధికంగా విజృంభించే ప్రాంతాల్లో చేయాల్సి ఉంటుంది. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికీ ప్రతి నెల నామమాత్రంగానే మిలాథిన్ కలిపిన మిశ్రమాన్ని ఫాగింగ్ చేస్తూ లక్షల రూపాయల ప్రజాధనం పక్కదారి పట్టించారనే ప్రచారం బహిరంగంగానే ▶మిగతా 2లో..

గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందాలి

జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్

విశాలాంధ్ర - వేలేరుపాడు/బుట్టాయిగూడెం : ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతి గిరిజన కుటుంబాలకు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ పేర్కొన్నారు. వేలేరుపాడు మండలం మోదేల గ్రామంలో అంగన్వాడీ సెంటరు వద్ద సోమవారం వివిధ శాఖల అధికారులు, షెడ్యూల్డ్ తెగల సంఘాల ప్రతినిధులు, నాయకులు, గిరిజన ప్రజలతో ఏర్పాటు ▶మిగతా 2లో..

పారదర్శకంగా అర్జీల పరిష్కారం

కలెక్టర్ కె. వెట్రిసెల్వి
పీజీఆర్‌ఎస్‌లో 248 అర్జీలు

విశాలాంధ్ర - ఏలూరు : పిజిఆర్‌ఎస్‌లో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో పాటు జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, సర్వే ఏడి అన్సారీ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆయా శాఖల వారీగా వచ్చిన ▶మిగతా 2లో..

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- ఫిర్యాదుల కోసం గోప్య కాల్ సెంటర్ - 14405
- నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలపై ఫిర్యాదు చేయండి
- కలెక్టర్ కీర్తి చేకూరి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : తూర్పు గోదావరి జిల్లా పరిసర ప్రాంతాల్లో ఎవరైనా నాటు సారా తయారు చేసినా, రవాణా చేసినా, అమ్మకాలు జరిపినా వెంటనే కాల్ సెంటర్ 14405 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్న సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయన్నారు. అందువల్ల ప్రజలు ధైర్యంగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేసారు. నాటు సారా నిర్మూలన - ప్రజారోగ్యం కోసం ప్రభుత్వ మిషన్ పని చేస్తోందని కలెక్టర్ పేర్కొంటూ నాటు సారా సేవించడం వల్ల వ్యక్తి ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ముఖ్యంగా శరీరంలోని ప్రధాన అవయవాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు. నాటు సారాను నిర్మూలించేందుకు ప్రభుత్వం "నవోదయం 2.0" అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, దీని లక్ష్యం ప్రజారోగ్య పరిరక్షణతో పాటు ఆర్థిక, సామాజిక శ్రేయస్సును కాపాడడమేనని ఆమె తెలిపారు. జిల్లాలో 19 మండల స్థాయి కమిటీలను, 240 గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

నాటు సారా తయారీ, నిల్వ, రవాణా లేదా విక్రయాలపై ఎవరైనా సమాచారం అందితే 14405 నంబరుకు కాల్ చేయవచ్చని, ఎక్సైజ్ శాఖ ద్వారా తక్షణ చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్, అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు, జిల్లా ఎక్సైజ్ అధికారి సిహెచ్ లావణ్య, ఆర్డీవోలు కృష్ణ నాయక్, రాణి సుస్మిత, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్. వి. వి. ఎస్. మూర్తి, డిఎస్‌వో వి. పార్వతి, డిఎంహెచ్‌వో కె. వెంకటేశ్వరరావు, డి ఐ పీఆర్వో కే లక్ష్మీ నారాయణ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బి. శశాంక, ట్రైబల్ ఆఫీసర్ కే ఎన్. జ్యోతి, ఎక్సైజ్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలి

- పరిశ్రమల్లో స్థానిక యువతకు 75% ఉద్యోగ అవకాశాలు కల్పించాలి
- నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి ఇవ్వాలి
- ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై. బాబి

విశాలాంధ్ర - కాకినాడ : నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అఖిలభారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై. బాబి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతున్నదన్నారు. నామమాత్రానికి మెగా డీఎస్సీ పోస్టులు భర్తీ చేసి రెండు లక్షలకు పైగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను పక్కన పెట్టారని విమర్శించారు. నిరుద్యోగ భృతి 3000 రూపాయలు ఇస్తానని ఎన్నికలకు ముందు హామీ ▶మిగతా 2లో..

స్వచ్ఛ ఆంధ్ర 2025 అవార్డులు

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : రాజమహేంద్రవరం పట్టణంలోని శ్రీ ఆనం వెంకటేశ్వర కళా కేంద్రంలో సోమవారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 'స్వచ్ఛ ఆంధ్ర 2025' జిల్లాస్థాయి అవార్డుల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

వివరాలు 8లో..

10న పింఛన్ అదాలత్

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: 10వ తేది ఉదయం 10 గంటలకు ఎస్ ఆర్ కె ఆర్ కె ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఏపీ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతి ప్రియ ఆధ్వర్యంలో పింఛన్ అదాలత్ నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సర్వీసులో ఉన్నవారు, రిటైర్డ్ ఉద్యోగులు ఈ కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు అన్నారు. జిల్లా అధికారులు తమ పరిధిలోని ఉప కార్యాలయాలకు సమాచారం అందించి వారికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి పెన్షన్ అదాలత్‌కు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పింఛను మంజూరు, జిపిఎఫ్, మిస్సింగ్ క్రెడిట్ సంబంధించి అన్ని సమస్యలను ఈ పింఛన్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చు అన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 9వ తేదీన పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశామని, అధికారులు అందరూ హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెంలో అక్రమంగా బియ్యం తరలిస్తున్న మినీ వ్యాన్ ను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.చౌక డిపోల ద్వారా సరఫరా చేస్తున్న బియ్యాన్ని అక్రమ వ్యాపారులు ప్రలోభ పెట్టి కొనుగోలు చేయటం ఇటీవల అధికంగా ఉంది. దీనిపై స్పందించిన గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు కలిసికట్టుగా బియ్యాన్ని తరలిస్తున్న వ్యాను, ఇద్దరు వ్యక్తులను సోమవారం తెల్లవారుజామున పట్టుకున్నారు.పట్టుకున్న బియ్యం, వ్యానును, తరలిస్తున్న వ్యక్తులను పోలీసులకు అప్పగించారు.దీనిపై సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ దుర్గాప్రసాద్ దర్యాప్తు చేసి పోలీసులకు రిపోర్టు అందించారు. దాదాపు 6 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. బియ్యం తరలిస్తున్న వ్యానును సీజ్ చేశారు. వీటిని తరలిస్తున్న వ్యక్తులపై 6ఏతో పాటు పౌరసరఫరాల నిరోధక చట్టం కేసును నమోదు చేశారు. పట్టుబడిన బియ్యాన్ని అధికారుల స్వాధీనంలో ఉంచారు. అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని స్థానికులు పట్టుకోవడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల సమీపంలోని బెల్టు షాపును తొలగించాలి

విశాలాంధ్ర-లింగపాలెం: పాచ్చానగరం పంచాయతీలో ఎంపీపీ పాఠశాల సమీపంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారని దీనిని తొలగించాలంటూ లింగపాలెంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ గ్రామానికి చెందిన ప్రజలు ఫిర్యాదు చేశారు. పాఠశాల సమీపంలో బెల్ట్ షాపు ఉండటం వల్ల మద్యం సేవించి అల్లర్లు చేస్తున్నారని దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో బెల్ట్ షాపును తక్షణమే తొలగించాలని కోరారు. ఇదే పంచాయతీలో తాళ్లూరి, శికాకొల్లు పేటలకు వెళ్లే ప్రధాన రహదారి మార్గం ఆక్రమణలకు గురైందని వీటిని తొలగించాలని కోరారు.ఆక్రమణలకు గురైన ప్రాంతంలో ప్రజలంతా కలిసి స్వచ్ఛందంగా బస్సు షెల్టర్ నిర్మించుకునేందుకు ముందుకు వచ్చారని దీని నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని వీరు కోరారు. డిప్యూటీ ఎంపీడీవో సుందరికి ఈ సమస్యపై మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

పరిష్కరించాలి (1వ పేజీ తరువాయి)

ఇచ్చి కూటమి ప్రభుత్వం సంవత్సరన్నర పూర్తయినా ఆ ఊసే లేదన్నారు. కాకినాడ జిల్లాలో పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కూలి పనికి కూడా పక్క రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి కొన్ని పరిశ్రమల్లో పనులు చేయిస్తున్నా స్థానికులు ఉద్యోగం లేక పనులు లేక ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఏమి చేస్తున్నారని విమర్శించారు. వెంటనే నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులను కూడగట్టి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఎం.వీరబాబు, గోనెల నాగభూషణం, మైఖేల్, దుర్గా, మధుబాబు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారం

(1వ పేజీ తరువాయి)

అర్జీలను పరిశీలించి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు, ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని ఆదేశించారు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 248 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫలాలు అందాలి

(1వ పేజీ తరువాయి)

చేసిన సమావేశంలో రాష్ట్ర మాజీ మంత్రి జలగం ప్రసాదరావుతో కలిసి జాటోత్ హుస్సేన్ పాల్గొన్నారు. దొరమామిడి గ్రామం నుండి మోదెల గ్రామం వరకు సుమారు 12 కిలోమీటర్లు జీప్ పై ప్రయాణం చేశారు. జాటోత్ హుస్సేన్‌కు గిరిజన ప్రతినిధులు, తండా ప్రజలు అపూర్వ ఘనస్వాగతం పలికారు.ప్రతి ఒక్కరిని పరిచయం చేసుకుని ఆప్యాయతతో పలకరించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఎలా జరుగుతున్నాయని, ప్రస్తుత సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గిరిజన ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు లేని గ్రామాల వివరాలు 15 రోజుల్లోగా నివేదికలు ఇవ్వాలని, మూడు నెలల్లో పనులకు శ్రీకారం చుట్టేలా చర్యలు తీసుకుంటా మని అన్నారు. కొన్ని గ్రామాల్లో మాజీ మంత్రి జలగం ప్రసాదరావు జెవిఆర్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ప్రతి గిరిజనుడికి స్టీలు కంచం, గ్లాసును,స్వీట్‌ను జాటోత్ హుస్సేన్ అందజేశారు. ఇచ్చిన ప్రతి అర్జీని స్వీకరించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి విషయంలో ఎవరూ కూడా కోర్టులకు వెళ్ళవద్దని, వెళితే సమయం, డబ్బు వృధా అవుతుందన్నారు. అదే నేరుగా ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకువస్తే త్వరితగతిన పరిష్కారం అవుతుందన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఏ పివో కె.రాములు నాయక్, ఇన్‌చార్జి ఆర్డీవో, యస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, డియఫ్‌వో జి.సతీష్ రెడ్డి, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి జి.త్రినాథబాబు, విద్యుత్ శాఖ ఇఇ ఫీర్ అహ్మద్ ఖాన్, గృహనిర్మాణ శాఖ ఇఇ కె.వి.వి.యస్. ప్రసాదు, డిప్యూటీ వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సురేష్, మండల వివిధ శాఖల అధికారులు, ఐటిడిఏ ఉద్యోగులు, సిబ్బంది, ఎస్టీ సంఘాల ప్రతినిధులు, నాయకులు, కూటమి నాయకులు, గిరిజనప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠాలు చెప్పిన జాటోత్ హుస్సేన్

బుట్టాయిగూడెం మండలం లంకపాకల/కోయిదా గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను సోమవారం జాతీయ షెడ్యూల్ ట్రైబ్స్ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధించి, కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు, విద్యార్థి దశ గోల్డెన్ రోజులని ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని అన్నారు. తాను కూడా గిరిజన వసతి గృహాల్లో చదువుకున్నానని, తమకు అప్పట్లో ఈ సౌకర్యాలు కూడా లేవని అన్నారు.

కల్పిస్తున్న సౌకర్యాలు, బోధన, పరిశుభ్రత, టాయిలెట్లను పరిశీలించారు. విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలను స్వయంగా రుచిచూసి ఎస్టీ కమిషన్ సభ్యులు సంతృప్తిని వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, స్నానాల గదులు పూర్తి పరిశుభ్రతతో ఉండాలని, మరమ్మత్తులకు గురైతే వెంటనే మరమ్మత్తులు చేయించాలని అధికారులను ఆదేశించారు.

మలేరియా విభాగం

(1వ పేజీ తరువాయి)

వినిపిస్తోంది. మలేరియా విభాగంలో ఫాగింగ్‌కి సంబంధించి సరైన రిజిస్టర్‌గాని, లాగ్ బుక్‌కానీ నిర్వహించలేదనే ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి ఇంజనీరింగ్ విభాగంలో బిల్లులు చెల్లించాలంటే లాగ్‌బుక్ నిర్వహణ, సంబంధిత అధికారి ధ్రువీకరణ తప్పనిసరిగా ఉండాలి. ఈ మలేరియా విభాగానికి సంబంధించి ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో నామ మాత్రపు ఫాగింగ్ చేసి భారీగా నిధులు స్వాహా చేశారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. 2023వ సంవత్సరం వరకు ఫాగింగ్‌కు సంబంధించి అత్యధికంగా సుమారు నెలకు 80 వేలు వరకు బిల్లులు చెల్లించగా 2024వ సంవత్సరం నుండి ఇదే ఫాగింగ్ కు సంబంధించి ప్రతి నెల రూ.1.50 లక్షలకు పైగానే బిల్లులు విత్‌డ్రా చేసి నిధులు స్వాహా చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విధంగా 2024వ సంవత్సరం నుండి 2025 జూన్ నెల వరకు ప్రతి నెల రూ.1.50 లక్షల నుండి రూ.2 లక్షల వరకు బిల్లులు పెడుతూ లక్షల రూపాయలు ప్రజాధనం పక్కదారి పట్టించారనే అంశం ప్రస్తుతం నగరపాలక సంస్థలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ తతంగం అంతా కూడా మలేరియా విభాగ ఉద్యోగి రాజకీయ నేతల అండదండలతోనే యథేచ్ఛగా చేసినట్టు కార్పొరేషన్ ఉద్యోగులు చెబుతున్నారు. విషయం బయటకు పొక్కడంతో సుమారు రెండు సంవత్సరాలుగా మలేరియా విభాగంలో పనిచేస్తున్న సదరు ఉద్యోగిని మలేరియా విభాగ విధుల నుండి తప్పించి నెల రోజుల క్రితం మరొక ఇన్‌స్పెక్టర్‌కు బాధ్యతలు అప్పగించడం ఈ ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తున్నది. గత ఏడాదిన్నర కాలంలో మలేరియా విభాగంలో జరిగిన అవినీతిపై అధికారులు ఎటువంటి విచారణ చేయకపోవడం కూడా తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో మలేరియా విభాగంలో జరిగిన అవినీతిపై గల్లా సునీల్ కుమార్ అనే వ్యక్తి గత కొంతకాలం క్రితం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి పీజీఆర్ ఎస్‌లో ఫిర్యాదు చేశాడు. మలేరియా విభాగంలో ఫాగింగ్ చేయకుండానే లక్షల రూపాయలు నిధులు విత్ డ్రా చేశారని, దీనిపై పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సెల్వి జిల్లా పరిషత్ సీఈఓను విచారణ అధికారిగా నియమించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. విచారణకు ఆదేశించి రోజులు గడుస్తున్నప్పటికీ చర్యలు మాత్రం శూన్యమనే చెప్పాలి. ఈ తరుణంలో జెడ్పీ సీఈవో అందజేసే నివేదికపై కలెక్టర్ ఎటువంటి చర్యలు తీసుకుంటారనేది వేచిచూడాల్సిందే. ఇదే విషయంపై నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్, ఇన్‌చార్జి ఎంహెచ్ఓ శివారెడ్డిని "విశాలాంధ్ర ప్రతినిధి" వివరణ కోరగా మలేరియా విభాగంలో జరిగిన అవినీతిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే సోదరులు

విశాలాంధ్ర-భీమడోలు: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు కోన శ్రీను సోదరులు కోన హనుమాన్ కుమార్తె వివాహ వేడుకకు ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సోదరులు భీమరాజు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ వేడుకలో నియోజక వర్గ, మండల, గ్రామస్థాయి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఒంటెకు శస్త్ర చికిత్స

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : ఎడారి ఓడగా పిలవబడే ఒంటెలకు స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద పశువుల ఆసుపత్రి వైద్యులు బి.ఆర్. శ్రీనివాసన్ విజయవంతంగా చికిత్స నిర్వహించారు. నెల్లూరు జిల్లాకు చెందిన కర్నూరం వెంకటరమణ గ్రామాలలో ఒంటెలతో సందడి చేస్తూ, చిన్నారులను, ఉత్సాహవంతు లైన యువకులను ఒంటెలపై ఎక్కించుకుని తిప్పుతూ వీటిపై వచ్చే ఆదాయంతో జీవన ఉపాధి కొనసాగిస్తుంటారు. ఒక ఒంటె చాతి కింద గాయం అయ్యి, పుండు ఏర్పడడంతో పశువుల ఆసుపత్రికి తీసుకురాగా పశు వైద్యులు బి.ఆర్. శ్రీనివాసన్(సర్జన్) పశు వైద్య సహాయకులు నరేష్ కలసి చాతి కింద పుండుకు, మూతి వద్ద ఏర్పడిన పుండుపై పురుగులను తీసి శుభ్రం చేసి శస్త్ర చికిత్స నిర్వహించి, ఉచితంగా మందులను అందించినట్టు శ్రీనివాసన్ పేర్కొన్నారు. పశు వైద్యాధికారులు ఒంటెలకు అందించిన చికిత్స అనంతరం ఒంటెల యజమానులు ఆనందం వ్యక్తపరిచారు.

చట్టాలపై అవగాహనతో ఉండాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. పోలవరం నియోజకవర్గంలోని మన్యం ప్రాంతాలలో పలు గ్రామాల పర్యటనకు వచ్చిన ఆయన కొయ్యల గూడెంలోని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొల్లిన నిర్మల కిషోర్ ఇంటి వద్ద ఏర్పాటుచేసిన పాత్రికేయ సమావేశంలో మాట్లా డుతూ దేశంలోని అన్ని వర్గాల ప్రజలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని గుర్తు చేశారు. తమ కమిషన్కు ఫిర్యాదు అందిన వెంటనే విచారణ చేపడతామని ఆయన తెలియజేశారు. దేశంలోని మొట్టమొదటిసారిగా గిరిజన మహిళను రాష్ట్రపతి గా నియమించిన ఘనత భారతదేశానికే దక్కుతుందన్నారు. ఏ ప్రాంతంలో సమస్య అయినా కమిషన్ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కారం చూపే దిశగా చర్యలు ఉంటాయని జాప్యం జరిగే ప్రసక్తే లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ ఆర్ ఆర్ పి. సుభద్ర దేవి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలదేవి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి, పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్, పారేపల్లి రామారావు, గొలిశెట్టి వాసు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బాల సరస్వతికి అదనపు బాధ్యతలు

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్‌గా జి.వి. బాల సరస్వతి అదనపు బాధ్యతలు స్వీకరించినట్లు సోమవారం తెలి పారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 8 వ తేదీ నుండి 14 వ తేదీ వరకూ ఏలూరులో ప్రత్యేక ఆధార్ క్యాంపులను కస్తూరిభా గవర్నమెంట్ స్కూల్, కోటదిబ్బలో ఈనెల8,9 తేదీల్లో గవర్నమెంట్ హై

స్కూల్, రామకోటి దగ్గర ఈ నెల 10,11, తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యా వికాస్ స్కూల్, ఆర్.టి.సి. బస్టాండ్ దగ్గర జంగారెడ్డిగూడెంలో ఈ నెల13,14న క్యాంపులు జరుగుతాయన్నారు. 5 సంవత్సరాల నుండి 7 సంవత్సరాల పిల్లలకు మొదటి బయోమెట్రిక్ అప్డేట్ మరియు 15 సంవత్సరాల నుండి 17 సంవత్సరం వారికి మొదటి లేదా రెండవ బయోమెట్రిక్ అప్డేట్ సేవలను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఇతర సేవలను రూ. 75 రూ. 125 నామమాత్రపు రుసుముతో చేయనున్నట్లు తెలిపారు. ఈ ఆధార్ క్యాంపులు ఉదయం 9.00 గం.ల నుండి సాయంత్రం 05.00 గం.ల వరకు కొనసాగుతా యన్నారు.

గ్రామ పంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికరణపై శిక్షణ

విశాలాంధ్ర- పాలకోడేరు : మండల స్థాయిలో 2025-26 సంవత్సర గ్రామపంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికరణ అనే అంశాలపై స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో మండల స్థాయిలో రెండు రోజులు అనగా ఈనెల 9, 10 తేదీల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి. రెడ్డయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి ఆ రెండు రోజులలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు భీమవరం మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ముఖ్యంగా మండల పరిషత్ అధ్యక్షులు, మండలంలోని 14 మంది గ్రామ సర్పంచ్‌లు, 17 మంది పంచాయతీ కార్యదర్శులు ఈ శిక్షణ తరగతులకు తప్పని సరిగా హాజరుకావల్సి ఉంటుందని తెలిపారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ

విశాలాంధ్ర- ఉంగుటూరు: గ్రామ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నామని నారాయణపురం గ్రామ సర్పంచ్ దిడ్ల అలకనంద శ్రీనివాస్ అన్నారు. సోమవారం నారాయణ పురంలో రూ. 6 లక్షల మండల

పరిషత్ నిధులతో వేస్తున్న సీసీ రోడ్డుకు సర్పంచ్ అలకనంద భూమి పూజలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, ఉప సర్పంచ్ మరడ సాంబశివరావు, ఎంపీటీసీ బండారు నాగరాజు, వార్డు సభ్యులు నీకూరి ఆశీర్వాదం, సచివాలయ పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి కృషి

విశాలాంధ్ర-టి.నరసాపురం: ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి వుందని తెలుగు దేశం పార్టీ నాయకులు ఘంటా సతీష్ తెలిపారు. బందంచర్ల గ్రామంలో ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య

అతిథిగా విచ్చేసిన సతీష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా అర్హత కలిగిన ఆటో డ్రైవర్లందరికీ రూ.15 వేలు ఇచ్చి ఆర్థిక భరోసా కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి విద్యా సాగర్, ఓబిళ్ళనేని శ్రీనివాసరావు, నాయుడు ధర్మ రాజు, కొక్కిరిగడ్డ బాల స్వామి, ఉప్పులూరి సతీష్, మారుమూడి ఇస్రాయేలు, కాకి నాగేశ్వరరావు, గుడిమెట్ల రాంబాబు, వీరంకి నాగేశ్వరరావు, నత్తా మిషక్ పల్లిపాం పిచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతస్థాయి

- కష్టాల నుంచి అనుభవాలు నేర్చుకున్నా
- అనుభవాలతో సేవా కార్యక్రమాలు
- రెవరెండ్ ఫాదర్ యోహాన్ మనోగతం

విశాలాంధ్ర-లింగపాలెం: పేదరికంవల్ల కలిగే కష్టాలను అనుభవించాను...కష్టాల అనుభవాల నుంచి ఎదుటివారికి సహాయ పడాలనే ఆలోచన చిన్ననాడే కలిగింది.ఆ ఆలోచనతోనే కష్టాలను ఛాలెంజిగా తీసుకొని చదువుకొన్న తాను ఈరోజు ఒక స్థాయిలో ఉంటూ తన వంతు ప్రజలకు సాయం చేయటం ఎంతో సంతృప్తి ఇస్తుం దంటూ ఫాదర్ యోహాను తన అభిప్రాయాలను వెలిబుచ్చారు. రంగాపురంనకు చెందిన ఫాదర్ యోహాను ఉన్నత చదువు చదివి ఆస్ట్రియా దేశంలో పదేళ్ల నుంచి మత బోధకునిగా పనిచేస్తూ సొంత గ్రామమైన రంగాపురాన్ని కేంద్రంగా చేసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిస్వార్థంతో పేద,అనాధ, దివ్యాంగులైన విద్యార్థులను గుర్తించి ఆర్థిక చేయూతనిస్తూ వారు చదువుకునేందుకు ఉపయోగపడుతున్నారు. ఈయన అందిస్తున్న చేయూత వల్ల చదువుకోవ డానికి దోహదపడుతుందని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. విద్య అనే ఆయుధం ప్రతి ఒక్కరికి ఉండాలని ప్రధానంగా పేదరికంలో ఉన్నవారికి విద్య ఉంటే వీరు ఉన్నత స్థాయిలో నిలబడి సమాజానికి ఉపయోగపడతారని ఫాదర్ యోహాను అన్నారు.పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడంతో పాటు ఒకేషనల్ కేంద్రాన్ని నిర్వహిస్తూ కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్,కుట్టు శిక్షణ తదితర కోర్సులు ద్వారా వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. తాను చిన్ననాడు కడుపేదరికాన్ని అనుభవించానని, కాలేజీకి వెళ్లేందుకు చార్జీలు కూడా ఉండేవి కాదని కొన్ని సమయాలలో నడుచుకుంటూ వెళ్లానని తెలిపారు. ఇటువంటి పరిస్థితులు ఇప్పుడు చదివే విద్యార్థులకు ఉండకూడదనే లక్ష్యంతో తన వంతుగా సేవ చేస్తున్నానని అన్నారు. తాను సేవా కార్యక్రమాలు చేయడం వెనుక ఎంతో కష్టం ఉందని తెలిపారు. తాను ఆస్ట్రియా దేశం వెళ్లటం అదృష్టంగా భావించానని ఆదేశ వాతావరణానికి అల వాటు పడటానికి ఎంతో శ్రమించానని అన్నారు. తాను ఆదేశంలో పనిచేస్తూ అక్కడ ప్రజల అభిమానాన్ని పొందటం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఆ దేశ ప్రజల ప్రోత్సాహంతో తనకు అప్పగించిన విధులను విజయవంతంగా నెరవేర్చ గలుగుతున్నానని పేర్కొన్నారు. తాను పడిన కష్టాలు జీవితంలో అనుభవాలు నేర్పాయని ఆఖరి నిమిషం వరకు విజయం కోసం ఎదురు చూసి విజయాలను అందుకున్నానని వివరించారు. మతం అంటే గౌరవం, మానవత్వం అంటే ప్రేమ కలిగి ఉంటానని మంచి చేయటానికి ఎన్ని అడ్డంకులు వచ్చినా ధైర్యంగా ఎదుర్కొంటానని అన్నారు.

ఆధునిక యుగంలో మౌర్య పాలనా నిర్మాణాల ఔచిత్యం

విశాలాంధ్ర - నరసాపురం: సమర్థవంత మైన పాలన, పౌర సంక్షేమం, రాజకీయ ఐక్యతను సాధించడంలో మౌర్య పాలనా నిర్మాణాల ఔచిత్యం నేటికీ మార్గదర్శకంగా నిలుస్తుందని మల్కిపురం డిగ్రీ కళాశాలకు చెందిన పి. సూర్యనారాయణ రాజు అన్నారు. శ్రీ వై ఎన్ కళాశాల చరిత్ర , రాజకీయ,భూగోళ శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'ఆధునిక యుగంలో మౌర్య పాలనా నిర్మాణాల ఔచిత్యం' అనే అంశముపై నిర్వహించిన కార్యశాలలో మాట్లాడారు.

కేంద్రీకృత పాలనా వ్యవస్థ, బ్యూరోక్రసీ, సామాజిక సంక్షేమానికి ప్రాధాన్యత, సమర్థవంతమైన న్యాయ వ్యవస్థ వంటి మౌర్యుల నమూనాలను ఆధునిక భారతదేశం తన పాలనా నిర్మాణంలో అవలంబించిందన్నారు.

పౌర, ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, దీనికి తోడ్పడేలా పన్నుల వసూలు, ప్రజల జనన మరణాల నమోదు, వాణిజ్యం వంటి వివిధ విభాగాలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. ప్రధాన రహదారుల నిర్మాణం, వాణిజ్య

మార్గాల విస్తరణ ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి కృషి చేశారన్నారు.

నేటికీ రహదారుల నిర్మాణం, వాణిజ్య విస్తరణ ప్రభుత్వ విధానాలలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ' ఉద్బోధించారు. ఈ వర్క్ షాపునకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతపల్లి కనకారావు అధ్యక్షత వహించగా, డీన్, ఐక్యూఏస్సీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గంధం శ్రీరామకృష్ణ, హెచ్ ఆర్ డి డైరెక్టర్ ప్రొఫెసర్ చినిమిల్లి శ్రీనివాస్, చరిత్ర శాస్త్ర విభాగాధిపతి ఎస్. సోమశేఖర్, డాక్టర్ ఎల్. మల్లేశ్వరరావు, పరిమి రామకృష్ణ, బయోటెక్ శ్యాంబాబు, మారుతీ రావు, జాగ్రఫీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్‌రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: పిజిఆర్‌ఎస్‌లో అందిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని, అధి కారులు ప్రతి రోజు విధిగా కొంత సమయం కేటాయించి క్షేత్రస్థాయిలో పర్యటించి

సమస్యలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ పిజిఆర్‌ఎస్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో పాటు డిఆర్‌ఓ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పిడి డాక్టర్ కెసిహెచ్ అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. సోమవారం వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజలనుంచి 168 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. పిజిఆర్‌ఎస్‌లో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకురాలు విజయశ్రీ డాక్టరేట్‌కు ఎంపిక

విశాలాంధ్ర - ఏలూరు : సమాజంలో పేదరికాన్ని పారద్రోలేందుకు తన వంతు కృషి చేస్తానని రోడ్డా విజయ అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా విజయశ్రీ చేస్తున్న సమాజ సేవను గుర్తించిన పలు స్వచ్ఛంద సంస్థలు ఆమెను పలు సేవ పురస్కారాలతో సత్కరించాయి. ఇటీవల

హైదరాబాదులో విశ్వజనని సేవా రత్న అవార్డును రాజకీయ నాయకులు, సినీ ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 12వ తేదీన హైదరాబాద్ నగరంలోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో జరిగే సన్మాన కార్యక్రమంలో డాక్టర్ చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ డాక్టరేట్ ప్రదా నం చేయనుంది. ఈ స్వచ్ఛంద సంస్థ ప్రధానంగా సమాజంలో వివిధ వర్గాల వారికి, పేద ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి వివిధ హోదాల్లో ఆయా వ్యక్తులను సన్మానిస్తుంది. గత కొన్నేళ్లుగా విజయశ్రీ చేస్తున్న సేవలను గుర్తించిన ఈ సొసైటీ 12వ తేదీన ఆమెకు డాక్టరేట్ అందించి సత్కరించనుంది. ఏలూరు నగరానికి చెందిన విజయశ్రీకి డాక్టరేట్ పురస్కారం లభించనుండటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 5వ తేదీన హైదరాబాదులో పాన్ ఇండియా సోషియా కల్చరల్ అసోసియేషన్ విజయశ్రీకి గాంధీ నేషనల్ ఫెలోషిప్ అవార్డును అందజేసి జ్ఞాపకతో సత్కరించింది.

10న పెన్షన్ అదాలత్

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు భీమవరంలో ఎస్. ఆర్. కె. ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో పెన్షన్ అదాలత్ అక్టోబర్10న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నారని, పెన్షన్ సమస్యలు ఉన్న పెన్షన్ దారులు కార్యక్రమానికి హాజరై తమ సమస్యను పరిష్కరించుకోవాలని తాడేపల్లిగూడెం ప్రభుత్వ పెన్షనర్లు అసోసియేషన్ అధ్యక్ష ,కార్యదర్శులు హరి కుమార్,వై. వి. వి. ఎస్. ఎన్. మూర్తి లు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్, జిల్లా కలెక్టర్, ట్రెజరీస్ డైరెక్టర్ ల సంయుక్త ఆధ్వర్యంలో పెన్షన్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందన్నారు. సమస్య ఉన్నవారు సంబంధిత డాక్యుమెంటరీ రుజువులతో అధికారుల ముందు చూపిస్తే సమస్య తక్షణం పరిష్కారం అవుతుందని చెబుతూ పెన్షన్ సంబంధిత సమస్య ఉన్నవారు హాజరై న్యాయం పొందాలని వారు సూచించారు.

బాణాసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు, జంగారెడ్డి గూడెం డీఎస్పీ యు. రవి చంద్ర పర్యవేక్షణలో జంగారెడ్డి గూడెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎంవి సుభాష్, ఎస్ఐ జబీర్ తన సిబ్బందితో సోమవారం

జంగారెడ్డి గూడెం పరిధిలో ఉన్న బాణాసంచా తయారీ, నిల్వ కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎంవి సుభాష్ మాట్లాడుతూ దీపావళి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో కొందరు అక్రమంగా బాణాసంచా తయారీ, నిల్వ లేదా విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందుగా బాణాసంచా కేంద్రాలపై తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణాసంచా తయారీకి సంబంధించిన కేంద్రాలు సంబంధిత అధికారుల అనుమతులతో మాత్రమే నడపాలని, పేలుడు పదార్థాలు నిల్వ చేసేటప్పుడు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. అక్రమ బాణాసంచా తయారీ లేదా నిల్వ జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే డయల్ 112 కు లేదా జంగారెడ్డి గూడెం పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వవలసిందిగా కోరారు.

బాల్య దశ నుంచి పిల్లల్లో మేధాశక్తిని పెంపొందించాలి

విశాలాంధ్ర -ముసునూరు : బాల్య దశ నుంచే పిల్లల్లో శారీరక శక్తితో పాటు మేధాశక్తిని కూడా పెంపొందించేందుకు అంగన్వాడి టీచర్లు కృషి చేయాలని చింతలవల్లి ఎంపీపీ స్కూల్‌మాస్టర్ జెనర్జీ అన్నారు. సోమవారం చింతలపల్లి గ్రామంలో నిర్వహించిన పోషణ అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా

విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రీస్కూల్ పిల్లల సమర్థత వారి ఆట పాట మాటల ద్వారా తెలుస్తుందన్నారు. పిల్లల్లో శారీరక అభివృద్ధికి గాను నిలబడి ఉన్నచోట ఎగర గలగడం, ఆటల్లో చురుగ్గా పాల్గొనడం, కుంట గలగడం, దారానికి పూలు ఎక్కించడం వంటివి నేర్పించాలని, మేధాశక్తి అభివృద్ధిపరచడానికి రుచులను, రంగులను, గుర్తించగలిగేలా చేయాలన్నారు. పిల్లల శారీరక దృఢత్వానికి వ్యాయామానికి సంబంధించిన ఆటలు ఆడిస్తూ మంచి పౌష్టికాహారం అందించా లని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులు సిబ్బంది పాల్గొన్నారు.

వన సంరక్షణ సమితిలో లెక్కలు తేల్చండి

విశాలాంధ్ర -చాట్రాయి: పర్వతాపురం వన సంరక్షణ సమితిలో 40 లక్షల రూపాయల లెక్కలు తేల్చాలని కోరుతూ ప్రజా వేదికలో నూజివీడు సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అంద జేశారు. చాట్రాయి మండలం పర్వతా పురం గ్రామంలోని అడవిలోని వన సంరక్షణ సమితిలో

సుమారు 40 లక్షల రూపాయలు నిధులు రాగా గ్రామ సభ నిర్వహించకుండా గ్రామస్తులు తెలియకుండా నిధులు మార్చేశారని లెక్కలు తేల్చాలని కోరుతూ సామాజిక కార్యకర్త రమణ బ్రహ్మ నూజివీడు ప్రజావేదికలో సబ్ కలెక్టర్‌కు ప్రజావేదికలో వినతిపత్రం అందజేశారు. జామాయిల్ కలప కూడా నరికి అమ్మేసుకున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి.

ప్రభుత్వాసుపత్రి సిబ్బంది సమస్యల పరిష్కారానికి పోరాటం

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న నర్సింగ్ స్టాఫ్, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆఫీస్ స్టాఫ్ తదితర విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ)నిరంతరం పోరాడు తుందని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.లక్ష్మణ మూర్తి తెలిపారు. సోమవారం ఏలూరు జిల్లా సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచి ఎన్నికలు లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో జరిగాయి.ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ఏలూరు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పనిచేస్తున్న మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఉద్యోగ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఏలూరు జిల్లా కేంద్ర సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి బ్రాంచికి 30 మందితో నూతన కమిటీ

ఎన్నికైంది. అధ్యక్షులుగా ఎం. రవికుమార్, కార్యదర్శిగా డి. లక్ష్మణమూర్తి, కోశాధికారిగా వి. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా టీఎస్ ఆచారి, ఎం. కిషోర్, బి. సందీప్, జి. రాజకుమార్,కే మణి,కే.శేషు, సహాయ కార్యదర్శులుగా పి. అరుణ్ గోపాల్,కె.శేఖర్, ఎం.హరిబాబు, పి.లోకేష్, ఎన్. బేబీ అనురాధ, సిహెచ్ అశోక్ కుమార్ ఎన్నికయ్యారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

విశాలాంధ్ర - నరసాపురం : ప్రజా సేవల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని టీడీపీ నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ సచివాలయాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేశారు. ఉదయం 11 గంటలకు సచివాలయం తెరవకపోవడంతో మండిపడ్డారు. ఈ సందర్భంగా స్థానికులు పలు విషయాలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. ఏదైనా పనిమీద సచివాలయానికి వచ్చినా ఎటువంటి ఉపయోగం లేదని, సిబ్బంది సమయానికి హాజరుకావడం లేదని వాపోయారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సచివాలయాల్లో సమయపాలనతో, బాధ్యతతో పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు నేరుగా అందాల్సిన సేవలు ఆలస్యమవ్వడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్లక్ష్యానికి పాల్పడే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో మొగల్తూరు మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, సత్తినేని బాబ్జి, బొల్లా నారాయణ విఠల్ తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర-లింగపాలెం : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎస్జిఎఫ్ సెలక్షన్స్ ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగాయి. అండర్-14 క్రీడలకు లింగపాలెం మండలం కలరాయనగూడెం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మాణికల అఖిల్ కుమార్ , చెరుకు విక్రమ్ రాష్ట్రస్థాయిలో హ్యాండ్ బాల్ క్రీడా పోటీలకు ఎంపిక అయ్యారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం. పద్మావతిని ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి కె. రామారావు, జె.రవీంద్ర, గ్రామ సర్పంచ్ సీహెచ్. రవిబాబు పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.

బహిరంగ వేలం ప్రకటన

డి.06-10-2025

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామపంచాయతీ శివారు కొత్తపల్లి గ్రామములోని ప్రాథమిక పాఠశాల పాత భవనము కూల్చి వేయుటకుగాను **తేదీ: 15-10-2025న ఉదయము 10.30 గం॥లకు** పాఠశాల ఆవరణలో వేలం పాట నిర్వహించబడును . ఆసక్తి కలవారు ముందుగా రు. 1000/- డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనగలరు.

వై రామకృష్ణ, ఎంపీడీవో
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

సైన్స్ టెక్నాలజీ చైర్మన్‌ను కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - గణపవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సైన్స్ టెక్నాలజీ చైర్మన్‌గా సోమవారం పదవి బాధ్యతలు చేపట్టిన మండలపు రవిని నిడమర్రు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రవిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఆక్వా బోర్డ్ డైరెక్టర్ నూరుద్దీన్ (మజీద్) మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల స్వామి, ఏలూరు జిల్లా తెలుగు యువత కార్యదర్శి మొహమ్మద్ గఫర్ ఖాన్, సత్తివీడి నాని, పేపేటి శ్యామసుందరం, పసుపులేటి సుబ్బయ్య, కొత్తూరు నరసింహారాజు, మొహమ్మద్ రియాజుద్దీన్ (జాకీర్) తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ద్వారా అన్ని వర్గాల వారికి అవగాహన కలిగేలా సచివాలయ, సంబంధిత శాఖల జీఎస్టీ ఛాంపియన్స్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ కార్యక్రమం సోమవారం సంబంధిత శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్

సెప్టెంబర్, 25వ తేదీ నుండి అక్టోబర్, 18వ తేదీ వరకు నాలుగు వారాలపాటు వారానికి ఒక థీమ్‌తో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్న దన్నారు. దీనిలో భాగంగా మొదటి, రెండవ వారాలలో చేపట్టవల సిన కార్యక్రమాలను నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. జిల్లాలో సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని సచివాలయ, సంబంధిత శాఖల జీఎస్టీ ఛాంపియన్స్ వారికి నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం అవగాహన కార్యక్రమాల లక్ష్యాలను పూర్తిచేసి, సంబంధిత కార్యక్రమాల వివరాలను సూపర్ జీఎస్టీ యాప్‌లో ఫోటోలతో సహ అప్లోడ్ చేయాలన్నారు. మొదటివారం ఇంటింటికి వెళ్లి జీఎస్టీ తగ్గింపు వలన ప్రజలకు కలిగే లబ్దిని తెలియజేశారని, రెండవ వారంలో వ్యవసాయ, అనుబంధ రంగాలలో జీఎస్టీ తగ్గింపు కారణంగా రైతాంగానికి కలిగే లాభాలను తెలియజేస్తున్నామన్నారు. సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఎంఎస్ఎంఈ, వర్తకులు, వినియోగదారులతో అవగాహన కార్యక్ర మాలను, ర్యాలీలను నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం పూర్తిచేయా లన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ వి. విశ్వేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా, జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, ప్రభుత్వులు పాల్గొన్నారు.

పుల్లయ్యకు ఉత్తమసేవా అవార్డు

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలం సింగగూడెం పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్ గా పారిశుద్ధ్య పను లను సక్రమంగా చేస్తున్న శ్రీకాకుళం పుల్లయ్యకు ఉత్తమ సేవా అవార్డును కలెక్టర్ వెట్రిసెల్వి అందించారు. సోమవారం ఏలూరులోని

సి.ఆర్.రెడ్డి ఆడిటోరియంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో ఈయనకు అవార్డును బహుకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పద్మశ్రీ,మేయర్ నూర్జహాన్,డిపిఓ అనురాధ పాల్గొన్నారు. అవార్డు అందుకున్న గ్రీన్ అంబాసిడర్ పుల్లయ్యను, గ్రామ కార్యదర్శి రాజును, లింగపాలెం డిప్యూటీ ఎంపీడీవో సుందరి, సింగగూడెం సర్పంచ్ బొంతు రాంబాబు అభినందించారు.

జనవాణిలో పాల్గొన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : జనవాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రత్యక్షంగా తమ సమస్య లను చెప్పుకునే వేదిక అని ప్రజల బాధలను నేరుగా వినడం, తక్షణ స్పందన పార్టీ ప్రధాన లక్ష్యమని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు.

సోమవారం మంగళ గిరిలో జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జన వాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను, అభ్యర్థనలను అందజేశారని అన్నారు. సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి, సంక్షేమం, సేవ ఈ మూడు అంశాలు తమ రాజకీయ ప్రస్థానానికి ఆధారమని ఎమ్మెల్యే బాలరాజు స్పష్టం చేశారు.

9న సెపక్ తక్రా పోటీలు

విశాలాంధ్ర-దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా అసోసియేషన్ జూనియర్ బాలురు, బాలికలు సెపక్ తక్రా పోటీలు 9న గురువారం మధ్యాహ్నం 2-30 గంటలకు దేవరపల్లి మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్లో జరుగుతాయని రామన్నపాలెం జిల్లా పరిషత్ ప్రధాన ఉపాధ్యాయులు పేరం రవీంద్రనాథ్ తెలిపారు. జిల్లా సెలక్షన్‌కు వచ్చే విద్యార్థులు జనవరి1,2007 జన్మించిన వారు ఉండాలని అలాగే ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు ఈనెల 11, 12 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని హై స్కూల్ ఎగ్జామ్ రవీంద్రనాథ్ తెలిపారు.

విద్యుదాఘాతానికి పాడి గేదె మృతి

విశాలాంధ్ర - సీతానగరం: విద్యుదాఘాతంతో పాడి గేదె ఆకస్మిక మృతి. మండలంలో రాపాక గ్రామ పంచాయతీ పరిధిలో సోమవరం విషాదం చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం రాపాక గ్రామపంచాయతీ పరిధిలో గల శ్రీరామనగరంకు చేసిన పాడి రైతు మద్దాల వెంకన్న బాబు సోమవారం మేత కోసం గేదెను రాపాక పొలాలు వైపు తీసుకొని వెళుతుండగా రాపాక సొసైటీ దగ్గర్లో గల డబ్బా ట్రాన్స్ఫార్మర్ విద్యుత్ తీగ తెగి అటుగా వెళుతున్న గేదెపై పడగా విద్యుత్ ఘాతంతో అక్కడికి అక్కడే మృతి చెందింది. దీంతో రైతు కన్నీరు మునీరు అయ్యి తనకు జీవనాధారం అయిన పాడి గేదె మృతి చెందడంతో ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు సైతం పాడి గేదె మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనను పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రజ కోరారు.

కొవ్వూరు బస్ స్టేషన్‌కు ద్వితీయ స్థానం

విశాలాంధ్ర- కొవ్వూరు: కొవ్వూరు బస్ స్టేషన్‌కు రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ బస్ స్టేషన్‌గా రెండో స్థానం లభించింది. ఇది బస్టాండ్ శుభ్రతపై, ఏర్పాట్లపైన ఇటీవల విశాలాంధ్ర ఇటీవల విశాలాంధ్ర దినపత్రికలో స్వచ్ఛ ఆంధ్రదిశగా కొవ్వూరు బస్ స్టేషన్ అనే శీర్షికన ఫోటోలతో సహా విశాలాంధ్ర దినపత్రికలో కథనాన్ని ప్రచురించింది. దీనికి అనుగుణంగా రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం లభించడం పట్ల ఆర్టీసి ఉద్యోగులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌తో ప్రతి ఇంటికీ లాభం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలు పేద, మధ్యతరగతి వర్గాలకు గొప్ప ఉపశమనం కలిగిస్తాయని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 24వ డివిజన్‌లో కూటమి నాయకులతో కలిసి సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్‌లోని దుకాణాలు, ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందచేసి సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ సూపర్ జీఎస్టీతో ప్రజలకు పెద్ద ఎత్తున మేలు జరుగుతుందన్నారు. 'జీఎస్టీ సంస్కరణలతో మేక్ ఇన్ ఇండియాకు ఊతమిస్తూ, భారతీయ బ్రాండ్లు గ్లోబల్ మార్కెట్‌లో పోటీ పడే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. దేశీయ ఉత్పత్తులు కొనుగోలు చేస్తే దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవుతారని, ఈ సంస్కరణలు ప్రతి ఇంటికీ లాభం కలిగిస్తాయన్నారు. టీడీపీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు మాట్లాడుతూ జీఎస్టీ 2.ఓ ద్వారా ప్రతి కుటుంబానికి నెలసరి రూ. 15,000 ఆదా కానుం దన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ జీఎస్టీలో తీసుకు వచ్చిన నూతన సంస్కరణల వల్ల సుమారు రూ.8,000 కోట్లు రాష్ట్ర ప్రజలకు ఆదా అవుతుందని చెప్పారు. పేదలు, మధ్యతరగతి ప్రజల జీవితాలను మార్చటమే లక్ష్యంగా జీఎస్టీ సంస్కరణలు తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీతో ప్రజలకు మేలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-తాళ్లపూడి : సూపర్ జీఎస్టీతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, ప్రతి నెలా ఒక కుటుంబానికి సుమారు రూ.1500ల వరకు తగ్గిన జి.ఎస్.టి వల్ల ఆదా అవుతుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయాన్ని రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధ్వర్యంలో ఇంటింటికి ఈ సమాచారాన్ని చేరవేయాలని తమ నాయకులను కోరామని పేర్కొన్నారు. సోమవారం తాళ్లపూడి మండలానికి విచ్చేసిన ఆయన గజ్జరం గ్రామంలో తగ్గించిన జి.ఎస్.టి వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అంధ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ అమలు చేయకపోతే స్థానిక తహసీల్దార్, ఎంపీడీఒలకు ఫిర్యాదు చేయాలని, జి.ఎస్.టి పిర్యాదులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవల పరిధిలోకి రాని వైద్య సేవలు అవసరమైన వారికి సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నామని, దీనిలో భాగంగా గజ్జరం గ్రామానికి చెందిన మహిళకు రూ.20 వేలు సిఎంఆర్ఎఫ్ చెక్‌ను అందించారు. గ్రామంలో పర్యటించినపుడు డ్రైన్లు సమస్యను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. గ్రామానికి చెందిన దివ్యఅంగురాలైన పులపల్లి శ్రీ పల్లి అనే ఓ యువతి ఎమ్మెల్యేకి పింఛను కావాలని మొర పెట్టుకుంది. ఈ కార్యక్రమానికి వచ్చిన ఆయన నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన సచివాలయ సిబ్బందిని పలకరించి, వైసీపీ హయాంలో ఏర్పాటైన సచివాలయ వ్యవస్థ లోపభూఇష్టంగా వుండన్నారు గజ్జరం వచ్చిన ముప్పిడితో ఎన్డీయే కూటమి నాయకులు కాకర్ల వంశీ, కొర్లపాటి, దత్తుడు, ఎం.ఎస్, ఉపసర్పంచ్ శేషు, గన్నిన సత్తిబాబు, పూలపల్లి బాలకృష్ణ, కూచిపూడి గణపతి, తీగిరిపల్లి కనక రత్నం తదితరులు హాజరయ్యారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు అందజేసిన అర్జీలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన పిజీఆర్ ఎస్ కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారానికి 7 అర్జీలు అందయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీలు సత్వరం పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు .అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కార తీరు ఉండాలన్నారు.

మాజీ ఎంపీ భరత్‌ను కలిసిన గౌతమ్

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : వైసీపీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ గుర్రం గౌతమ్ సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి సిటీ బూత్ ప్రెసిడెంట్ గణేష్‌రెడ్డి, వైసీపీ 30వ వార్డు ఇంచార్జ్ కాటం రజనీకాంత్, వైసీపీ నాయకులు దుల్లం ప్రసాద్, ఉమ యాదవ్, ఎండి ఉస్మాన్, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వెంకటేష్‌కు ఆర్ఎల్ ఠాకూర్ అవార్డు

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాజమహేంద్రవరానికి చెందిన యువ శాస్త్రవేత్త డాక్టర్ పిల్లి వెంకటేష్ ప్రతిష్ఠాత్మక డాక్టర్ ఆర్ఎల్ ఠాకూర్ అవార్డును అందుకోనున్నారు. నగరంలోని ఆల్కాట్ తోటకు చెందిన పిల్లి సత్యనారాయణ కుమారుడైన వెంకటేష్ కోల్ కతాలోని సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్ రీసెర్చ్ సెంటర్‌లో సైంటిస్ట్‌గా పని చేస్తున్నారు. సిరామిక్ విజ్ఞాన, సాంకేతికరంగాల్లో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనను, జంషెడ్ పూర్‌లోని టాటా స్టీల్ సంస్థలో ప్రిన్సిపల్ రీసెర్చర్‌గా పనిచేస్తున్న అనుశ్రీ నాగ్‌లను సంయుక్తంగా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఇండియన్ సిరామిక్ సొసైటీ గౌరవ కార్యదర్శి డాక్టర్ జితేందు మండల్ తెలిపారు. నవంబర్ 27 న ముంబాయి ఐఐటీలో జరిగే ఇండి యన్ సిరామిక్ సొసైటీ 89వ వార్షిక సదస్సు ప్రారంభవేడుకలో డాక్టర్ వెంకటేష్ అవార్డును అందుకుంటారు.

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన నిర్మల

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ గా నియ మితులైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు తురకల నిర్మల సోమవారం తిలక్ రోడ్డులోని నగర టీడీపీ కార్యాలయంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పార్టీ నాయకులతో కలిసి శాలువతో సత్కరించారు. తనకు ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు డైరెక్టర్‌గా అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావులకు తురకల నిర్మల కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: పొగాకు ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి పెట్టాలని రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ప్రసాద్ పేర్కొన్నారు దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం సాయంత్రం దేవరపల్లి గోపాలపురం పొగాకు రైతులకు పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారి హేమ స్మిత అధ్యక్షతన జరిగిన రైతుల సమావేశంలో జి ఎల్ కె ప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ జరుగుతున్న పరిణామాల దృష్ట్యా పొగాకు పంటను నియంత్రవలసి వస్తుందని అన్నారు. డిమాండ్ సప్లై పొగాకు రేటు ఉంటుందా అని అన్నారు. భవిష్యత్తులో పొగాకు ఇదే రేటు ఉంటుందని నమ్మకం లేదన్నారు ప్రస్తుత పరిస్థితులు దృశ్య పొగాకు రైతులు పొగాకుకు ప్రత్యేకంగా ఆరుతడు పంటలు వేయాలని ఆయన కోరారు. పరిమితి మించి పొగాకు పండించటం వలన అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. వ్యవసాయ , ఉద్యానవన, పశ్వుతి వ్యవసాయ అధికారులు సూచించిన విధంగా రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలన్నారు. కొవ్వూరు వ్యవసాయ శాఖ ఏడిఏ శ్రీనివాస మాట్లాడుతూ దేవరపల్లి గోపాలపురం పొగాకు వేలం కేంద్రం పరిధిలోని రైతులు పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలైన కొబ్బరి, పామాయిల్, నువ్వులు, వేరుశనగ మొదలగు ఆరుతడు పంటలు వేయాలని ఆయన పేర్కొన్నారు. ఆరుతడి పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. మండల ఉద్యానవనాధికారి జీవి రమేష్ మాట్లాడుతూ రైతులు ఉద్యానవన పంటలపై దృష్టి పెట్టాలని రైతులకు కావలసిన వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు ఎరువులు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందన్నారు. పామాయిల్ రైతులకు 2021 నుంచి రావలసిన బకాయిలు చెల్లించటం జరుగుతుందని ప్రభుత్వం 23 కోట్లు విడుదల చేసిందని ఇప్పటివరకు 21 కోట్లు రైతులకు బకాయిలు చెల్లించడం జరిగింది అని తెలిపారు. ప్రతి రైతు ఈ క్రాపు చేయించుకోవాలని ఆయన సూచించారు. దేవరపల్లి మండల వ్యవసాయ అధికారి కే కమల రాజు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆఫ్రికా నత్త వలన రైతులకు అనేక అనర్ధాలు వస్తున్నాయని రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని ఆఫ్రికన్నతను నిర్మూలించాలని కోరారు. ఆఫ్రికన్ నత్తను నిర్మూలించడానికి ఐదు కిలోల ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని ఆయన సూచించారు. ఆఫ్రికా నత్త 43 వేల గుడ్లు పెడుతుందని ఇది విపరీతంగా పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం మండల వ్యవసాయ అధికారి ఏసుబాబు, దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్మాణాధికారి హేమ స్మిత, గోపాలపురం పొగాకు వేలం కేంద్ర అధికారి మీరా రైతు నాయకుడు నరహరిశెట్టి రాజేంద్ర బాబు, పొగాకు రైతు నేతలు కరుటూరి శ్రీనివాస్ నాయుడు ,దుర్గాప్రసాద్ గద్దె శేషగిరిరావు, దుద్దుపూడి హరిబాబు, సత్తి జగదీశ్వరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు : ఆర్డీవో

విశాలాంధ్ర -కొవ్వూరు : డివిజన్‌లో ప్రజల ఎటువంటి సమస్యలనైనా సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీ సుకుంటామని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాల యంలో నిర్వహించిన "పి జి ఆర్ ఎస్ - మీ కోసం" వేదికలో వచ్చిన అర్జీల ను ఆర్డీవో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ మీకోసం పిజి ఆర్ఎస్ ద్వారా ఆరు 6 అర్జీలు వచ్చాయని తెలిపారు. డివిజన్ అధికారులు మీకోసం పిజిఆర్ఎస్ కార్య క్రమంలో తప్పనిసరిగా హాజరయ్యి ప్రజల సమస్యలను తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ఇవ్వడం కోసం "1100 - మీకోసం కాల్ సెంటర్" కు ఫోన్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయుటకు మరియు నమోదైన మీ అర్జీ యొక్క స్థితిగతులు తెలుసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అర్జీదారులకు నమ్మకం కలిగించాలి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన ప్రతి అర్జీపై క్రియాత్మకంగా స్పందించి, ప్రభుత్వ పనితీరు పట్ల అర్జీదారులలో నమ్మకాన్ని పెంపొందించాలని డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించగా మొత్తం 17 అర్జీలు వచ్చాయి. వీటిలో ఇంజనీరింగ్ కి సంబంధించి 7, రెవెన్యూకి సంబంధించి ఒకటి, టౌన్ ప్లానింగ్ కి సంబంధించి 3, పబ్లిక్ హెల్త్ కి సంబంధించి 3, వార్డు సచివాలయాలకు సంబంధించి మూడు ఉన్నాయి. ప్రతి అర్జీని నాణ్యతతో అర్జీదారుల సంతృప్తి కొలమానంగా పరిష్కార మార్గాలు చూపాలని డిప్యూటీ కమిషనర్ అన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ జి.శైలజవల్లి, ఎస్ఈ(ఇంఛార్జి) రీటా, మేనేజర్ ఎండి అబ్దుల్ మలిక్, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, అన్ని విభాగాల హెచ్ఓడీలు, అధికారులు పాల్గొన్నారు.

'స్థానికం'గా సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : మండల, డివిజన్ స్థాయిలో పరిష్కరించ గల సమస్యలను జిల్లా స్థాయి గ్రీవెన్స్ కార్యక్రమానికి రాకుండా స్థానిక స్థాయిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. తహసిల్దార్, ఎంపీడీవో లు వ్యక్తిగత బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఇకపై అంశాల వారిగా అర్జీలు పై మండలాలు వారిగా విశ్లేషణ చేయడం జరుగుతుందని తెలియ చేశారు. ప్రజల్లో సమస్య పరిష్కారం విషయంలో సానుకూల దృక్పథం కలిగి ఉండాలని కలెక్టర్ కీర్తి స్పష్టం చేశారు. సోమవారం బొమ్మూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమంలో కలెక్టర్ శ్రీమతి కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై. మేఘస్వరూప్, డిఆర్ఓ టి. సీతారామమూర్తి ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చురుకైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా ప్రజలు మీ వద్దకే రావడం జరుగుతుందని తెలియ చేశారు. జిల్లా స్థాయిలో వస్తున్న అర్జీలలో 90 శాతం మండల స్థాయిలోనే పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేశారు. రెవెన్యూ, సర్వే, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన అర్జీలు అధికంగా వస్తున్నాయని పేర్కొంటూ, ఈ శాఖలు తమ పనితీరును మెరుగుపరచుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐవిఆర్ఎస్. కాల్స్ ద్వారా ప్రజల అభిప్రాయాలను తెలుసు కోవడం ఆమేరకు శాఖల పనితీరును పర్యవేక్షిస్తోందని వివరించారు. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేరుగా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించండం జరుగుతోందని వెల్లడించారు. గ్రామాల్లో రీ-సర్వే చేపడుతున్నప్పుడు సంబంధిత భూ యజమానులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని, మ్యుటేషన్ దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. భూముల మ్యుటేషన్ తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా వివరించే 'స్పీకింగ్ ఆర్డర్' తప్పనిసరిగా ఇవ్వాలని తహసీల్దార్లకు సూచించారు. జీఎస్టీ సంస్కరణలతో వస్తువుల ధరలు తగ్గిన నేపథ్యంలో, అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్,డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. మద్దూరు గ్రామానికి చెందిన కాట్రగడ్డ శ్రీహరనాథ్ మా గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గత 20 సంవత్సరాలు నుండి రోడ్డు వేయడం లేదని గ్రామస్తులు అందరి తరపున అర్జీ పెట్టుకోగా సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ పంచాయతీ రాజ్ అధికారులకు సూచిస్తూ పరిష్కరించవలసిందిగా ఆజ్ఞలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘ స్వరూప్, డిఆర్వో టి సీతారామ మూర్తి, సిపివో ఎల్ అప్పల కొండ, డీఆర్డీఏ పిడి ఎన్ వి వి ఎస్ మూర్తి, డిపివో వి. శాంతామణి, ఎడి సర్వే బి లక్ష్మీ నారాయణ, డి ఎస్వో వి పార్వతి, డీఏమ్ పౌర సరఫరాలు బి. గణేష్ కుమార్, ఎస్ ఈ ఆర్ అండ్ బి ఎస్ బి వి రెడ్డి, ఎస్ ఈ ఇరిగేషన్ కె. గిరిధర్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవ రావు, డి ఎమ్ హెచ్ వో కె వెంకటేశ్వర రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

'రంగరాయ'లో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఏర్పాటుకు చర్యలు : ఎంపీ

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఎంతో ప్రాముఖ్యత ఉన్న కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత పార్లమెంట్ సమావేశాల్లో కాకినాడ జిజిహెచ్‌ను ప్రధానమంత్రి స్వస్థ్య సురక్ష యోజన (PMSSY) పథకంలో చేర్చి అభివృద్ధి చేయాలని కోరగా, ఈ పథకం ద్వారా కేవలం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో అభివృద్ధి పనులు మాత్రమే ఆర్థిక సహాయం అందజేస్తామని కేంద్రం స్పష్టం చేసిందన్నారు, దీనికనుగుణంగా కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీని ్రామీూ్ పథకంలో చేర్చి 330 పడకల సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇటీవల కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాను కలిసి వినతి పత్రం అందించడం జరిగిందన్నారు. ఆర్ఎంసిలో ప్రతి యేటా 250 మంది ఎంబిబిఎస్, 203 మంది పీజీ, 10 మంది సూపర్ స్పెషాలిటీ నిపుణులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. అయితే ప్రత్యేకంగా సూపర్ స్పెషాలిటీ బ్లాకు లేకపోవడం వల్ల జనరల్ మెడిసిన్, సర్జరీ విభాగాలపై భారం పడుతుందన్నారు. కార్డియాలజీ, న్యూరో సర్జరీ, ఆంకాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ మరియు క్రిటికల్ కేర్ విభాగాలతో కూడిన 330 పడకల సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణం కోసం ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో పాటు కాకినాడ గవర్నమెంట్ ఐటిఐ ఆవరణలో 3.24 ఎకరాలు, కేన్సర్ సెంటర్‌కు 0.30 ఎకరాలు కేటాయించినట్లు కేంద్రమంత్రికి వివరించినట్లు తెలిపారు. త్వరితగతిన PMSSY ద్వారా సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి జెపి నడ్డాను కోరగా సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

రామకృష్ణ మిషన్ ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - సీతానగరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మండలంలో సీతానగరం గ్రామంలో కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృసిష్ణ మిషన్ కార్యదర్శి స్వామీ పరిజ్ఞేయనంద మహారాజ్ తెలిపారు. ఈ శిబిరంలో డా మహ్మద్ ఫాతిమా. డా సత్యం రమేష్ బాబుచే సుమారు 250మందికి రోగులకు వైద్యసేవలు అందించారు. 119 మందికి రక్త, నీరుడు, 5 థైరాయిడ్, 2 ఇ.సి.జి. పరీక్షలు నిర్వహించారు. పరమహంస యోగానంద నేత్రలయ వేమగిరి వారిచే సుమారు 65గురుకి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 6 గురుకి శుక్లాం ఆపరేషన్ నిమిత్తం వేమగిరి ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. 11 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వైద్య శిబిరం వచ్చిన రోగులకు పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి కుమారి జి. సుశీల, రామకృష్ణ మిషన్ కో ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్ ,యన్నమని వెంకట నారాయణ, పాండ్రు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చొల్లంగి అప్పాజీ

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఏపిఎంఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బిఆర్‌కె న్యూస్ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ చొల్లంగి అప్పాజీ నియమితులయ్యారు. ఆదివారం విజయ వాడలో జరిగిన ఏపిఎంఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమా వేశంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పి ఢిల్లీబాబు రెడ్డి ఈ నియామకాన్ని ప్రకటించారు. ఏపిఎంఎఫ్ ప్రధాన కార్యదర్శి ఢిల్లీబాబు రెడ్డి, రాష్ట్ర కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్ బాబు, ఐజెయు మాజీ ఉపాధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస్, ఏపిఎంఎఫ్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు కాకర సుధీర్, కార్యదర్శి కుంపట్ల బాబీ, ట్రెజరర్ దొమ్మేటి శ్రీనివాస్, గుబ్బల దుర్గాప్రసాద్ తదితరులు అప్పాజీని సన్మానించారు.

అర్జీలకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి : ఎస్పీ

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం', (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్.పి. డి. నరసింహ కిషోర్ నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి వారి కష్టాలను, బాధలను స్వయంగా అడిగి తెలుసుకుని, వెనువెంటనే నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాదిదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయవలసిందిగా ఉత్తర్వులు ఇచ్చారు. సోమవారం "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం" కార్యక్రమానికి 25 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు మరియు ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించారు. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎన్ బి ఎం మురళీకృష్ణ , అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఏ.వి సుబ్బరాజు కూడా పాల్గొని అర్జీలను స్వీకరించారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ధరణాలకోట శ్రీను

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజు అన్నారు. సోమవారం కాకినాడ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాదేపల్లి సత్యానందరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ కేంద్రమంత్రి ఎంఎం పల్లంరాజు, పీసీసీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ జెడి శీలం హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ధరణాలకోట శ్రీనును నియమిస్తూ నియామక పత్రాన్ని మాజీ కేంద్ర మంత్రి ఎంఎం పల్లంరాజు చేతుల మీదుగా శ్రీనుకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్యానందరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే వారిని తప్పకుండా వారికి గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం ధరణాలకోట శ్రీను మాట్లాడుతూ తనకు జిల్లా పదవి కల్పించడంపై కాంగ్రెస్ పార్టీ కాకినాడ పార్లమెంటరీ ఇంచార్జ్ మల్లిపూడి రాంబాబు, జిల్లా అధ్యక్షులు సత్యానందరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులైన శ్రీనుకు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

సచివాలయం తరలింపుపై ఫిర్యాదు

విశాలాంధ్ర-కొవ్వూరు : ప్రజలకు అందుబాటులో ఉండే సచివాలయాన్ని వేరే వార్డులోనికి తరలించడం సరికాదని ఐదవ వార్డ్ కౌన్సిలర్ మద్దిపట్ల సాయి గీత అన్నారు. 5, 6, 7 వార్డులకు ఐదవ వార్డులో ఏర్పాటు చేసిన సచివాలయంను ఏడవ వార్డులోనికి తరలించడం పట్ల వార్డులోని ప్రజలు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాణి సుస్మితను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మద్దిపట్ల సాయిగీత మాట్లాడుతూ 5,6,7 వార్డులకు అందుబాటులో ఉండే విధంగా ఐదో వార్డు గోదావరి గట్టు సమీపంలో సచివాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని నేడు కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజలకు అందుబాటులో ఉండే సచివాలయాన్ని వేరే ప్రాంతంలోకి మార్చే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తక్షణమే సచివాలయాన్ని వేరే ప్రాంతానికి తరలించే ప్రయత్నాలను నిలిపివేయాలని కోరుతూ ఆర్డిఓకు వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. 5, 6, వార్డులలోని ప్రజలు పాల్గొన్నారు

రాష్ట్ర తైక్వాండో పోటీలకు విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర - రాజోలు : రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు రాజోలుకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపిక అయినట్లు కోచ్ మణికుమార్ తెలిపారు. ఈనెల 4న కాకినాడలో జరిగిన అండర్-17 జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో రాజోలుకు చెందిన వై గంగాభవాని, హేమ సత్యశ్రీ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరిని సోమవారం రాజోలు ఎల్‌బినగర్‌లో జరిగిన ఒక కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణ, ఆర్గనైజర్ కర్రి విజయ్ నారాయణ, కోచ్‌లు మణి కుమార్, కరుణ కుమార్ అభినందించారు.

ప్రైవేట్ పాఠశాలల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వీఎస్‌పి చౌదరి ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - గండేపల్లి : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీగీతం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ వీఎస్‌పి చౌదరి ఆదివారం విజయవాడలో ఒక ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్య రాజు చేతుల మీదుగా చౌదరిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 26 జిల్లాల నుంచి విచ్చేసిన కరస్పాండెంట్ లందరికీ రాష్ట్ర కమిటీ ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షులు, కొత్తగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు రాష్ట్ర కమిటీ ఘనంగా సత్కరించింది. కాకినాడ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా పాలిక నరసింహమూర్తి, తోటకూర వెంకటేశ్వరరావులను ఈ సందర్భంగా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. త్వరలోనే జిల్లాలోని పూర్తిస్థాయి ఎంటి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విఎస్‌పి చౌదరి మాట్లాడుతూ అభివృద్ధి కోసం కృషి చేస్తానని, సంఘంలో ఏ సభ్యుడుకి కష్టం వచ్చినా వారికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం ప్రైవేట్ స్కూల్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనని ఈ పదవికి ఎంపిక చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అధ్యక్షులు సుబ్రమణ్యం రాజు, మాజీ రాష్ట్ర అధ్యక్షులు సుందర రామ శర్మ, రాష్ట్ర నాయకులు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

పేకాటరాయుళ్లపై కఠిన చర్యలు : సీఐ

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలాల పరిధిలోని ఏ గ్రామంలోనైనా పేకాటకు బానిసలు అయితే ఉపేక్షించేది లేదని జగ్గంపేట వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. జగ్గంపేట మండల పరిధిలోని కాట్రావుల్లపల్లిలో పేకాట ఆడుతున్న ఏడుగురు మందిని జగ్గంపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7,740లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జూధాలకు పాల్పడటం వల్ల సంబంధిత వ్యక్తుల భవిష్యత్తు పాడవుతుందని సంబంధించిన వారికి కుటుంబీకులు జుధాలువల జరిగే నష్టాన్ని అవగాహన కల్పించాలన్నారు.

తాగునీటి పథకాలు పూర్తిచేయాలి

విశాలాంధ్ర - సామర్లకోట : జల జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి పథకాలు మూడేళ్ళలో పూర్తి చేసుకోవాలని గ్రామీణ నీటిపారుదల విభాగం చీఫ్ ఇంజినీర్ ఇషాన్‌భాషా పిలుపునిచ్చారు. ప్రజలందరికీ తాగునీటి భద్రత కల్పించాలన్న ఉద్దేశంతో గ్రామ, మండలస్థాయి అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నీటిపారుదల విభాగం ఏఈఈలు, డిప్యూటీ ఎంపీడీవోల తొలి బ్యాచ్ శిక్షణ తరగతులను సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో సోమవారం ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో ప్రమాణాలు పాటించని ఆర్వో కేంద్రాల నీటి వాడకం బాగా పెరిగిందని, దీనివల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని సీఈ అన్నారు. ఈ శిక్షణ తర్వాత తాగునీటి సరఫరా, నాణ్యత మెరుగుపడుతుందని లక్ష్మణరావు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యంలో కీలకమైన తాగునీటి పథకాల నిర్వహణలో భాగస్వాములు సమన్వయంతో పనిచేయాలని ఈటిసి ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్ కెఎన్‌వి ప్రసాదరావు కోరారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి యూనిట్లను వారు పరిశీలించారు. తొలి బ్యాచ్‌లో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన 40 మంది ఈ మూడు రోజుల శిక్షణకు హాజరయ్యారు. ఈనెల 6 నుంచి 17 వరకూ బ్యాచ్‌ల వారీగా 402 మందికి ఈ శిక్షణ ఏర్పాటు చేశారు. వీరి తర్వాత గ్రామ స్థాయి అధికారులైన ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు కూడా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ అండ్ ఎస్ కాకినాడ ఎస్ఈ అబ్దుల్ మతీన్, రిటైర్డ్ ఎస్ఇ ఉమాశంకర్, పెద్దాపురం డిఈఈ స్వామి, యీ శ్రీరామ్, ఈటిసి వైస్ ప్రిన్సిపల్ జి రమణ, ఛీఫ్ ఇన్స్ట్రక్టర్ డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆసుపత్రికి స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర అవార్డు

విశాలాంధ్ర - కరప : కరప మండలం గురజానపల్లి ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రికి స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర అవార్డు లభించిందని ఆయుర్వేద ఆస్పటల్ వైద్యాధికారిణి డాక్టర్ బి దివ్య పేర్కొన్నారు. సోమవారం కాకినాడలో గోదావరి కళాక్షేత్రంలో జరిగిన అవార్డుల ప్రదానం కార్యక్రమంలో డాక్టర్ దివ్యకు కలెక్టర్ షాన్మోహన్ సగిలి చేతుల మీదుగా అవార్డు అందుకు అవడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. కాకినాడ జిల్లాకు స్వచ్ఛ ఇండస్ట్రీస్ కింద ఒక అవార్డు, స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్స్ కింద అవార్డులు ప్రకటించారని, జిల్లాస్థాయిలో 15 కేటగిరీల్లో 50 అవార్డులను ప్రకటించగా జిల్లాస్థాయిలో అవార్డు ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పటల్ వైద్యాధికారినికి డా దివ్యకు రావడం సంతోషంగా ఉందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే సంవత్సరం రాష్ట్రస్థాయి అవార్డుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ షాజద్ అలీ, సిబ్బంది కృష్ణమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సూపర్ 6-పథకాలు అమలు చేయాలి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : కొత్తపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో గ్రామ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆనాల సుదర్శన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని ఇప్పటివరకు సూపర్ 6-పథకాలు ఎంత వరకు ప్రజలకు చేరయో ప్రజలకు అవగాహన కల్పించాలని హామీలు నెరవేర్చే వరకు గ్రామస్థాయి నుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షులు పొన్నగంటి రామకృష్ణ, పోలినాటి జోయల్, పల్లా లక్ష్మణ్, పిచ్చుక సతీష్, మలిపెద్ది నందీశ్వరరావు, పలివెల వీరబాబు, కుమ్మరి జాన్, దడాల సుకుమార్, వానాసి ప్రసాద్, బందిలి ధర్మలత, సలాది నూకరత్నం, కుమ్మరి రత్నం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు: పీడీ

విశాలాంధ్ర - పిఠాపురం : ప్రాధాన్యతా పరంగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పాడా ఇన్చార్జ్ పీడీ వేణుగోపాలరావు తెలిపారు. పిఠాపురం మున్సిపల్ గెస్ట్ హౌస్లోగల పాడా కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో భాగంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన పత్తి రైతులు పంట నష్టపరిహారం కోరుతూ వినతిపత్రం అందజేశారు. పత్తి పంటకు ఇంట్లో ఉన్నదంతా ఊడ్చిపెట్టి, డబ్బులు అప్పు చేసి లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టినదంతా నకిలీ విత్తనాల కారణంగా మొత్తం సర్వనాశనం అయిపోయిందని రైతులు గగ్గోలు పెట్టారు. తామంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, ఇక్కడి ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తమను ఆదుకోవాలని రైతులు వేడుకున్నారు. పట్టణంలో పారిశుద్ధ్యం నిర్వహణ చాలా అసహ్యంగా ఉందని, చెత్తను తీసుకెళ్ళపోవడం, డ్రైనేజీల్లో తీసిన సిల్టు రోడ్డుపైనే వేసి ఉంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే దీన్ని పరిష్కరించాలని బీజేపీ సీనియర్ నాయకుడు బుర్రి మురళీధర్రావు ఫిర్యాదు చేశారు. పట్టణంలో లిక్కర్ బెల్ట్ షాపులు ఎక్కువైపోయాయని, రాత్రి 11 గంటల సమయం దాటినా బ్రాందీ షాపులు తెరుచుకునే ఉంటున్నాయంటూ సీపీఐ కార్యదర్శి సాకా రామకృష్ణ ఫిర్యాదు చేశారు. పాడా ఇన్చార్జ్ పీడీ వేణుగోపాలరావు సంబంధిత శాఖాధికారులను పిలిచి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వసంతమాధవి, పిఠాపురం తహశీల్దార్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : కమిషనర్

విశాలాంధ్ర - కాకినాడ : పీజీఆర్ఎస్‌లో నమోదైన పిటిషన్‌లు తిరిగి ఓపెన్ కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో కమిషనర్ భావన స్వయంగా పాల్గొని ప్రజల నుండి నేరుగా అర్జీలను స్వీకరించారు. పిటిషన్‌లను నిర్ణీత సమయానికల్లా పరిష్కరించాలని, అలసత్వం ప్రదర్శించిన అధికారులపై చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు. మొత్తం 13 మంది తమ సమస్యలపై కార్పొరేషన్‌కు వచ్చి అర్జీలు సమర్పించగా, కమిషనర్ వాటిని స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు అందజేసి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకుముందు ఉదయం 9:30 గంటల నుండి 10:30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో ముగ్గురు ఫోన్ ద్వారా తమ సమస్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కెటీ సుధాకర్, ఎస్ఈ వెంకట్రావు, మేనేజర్ సీతారాం, శానిటేషన్ సూపర్వైజర్ రాంబాబు, డీసీపీ కృష్ణారావు, అకౌంటెంట్ రామశాస్త్రి, ఏఈలు, డీఈలు పాల్గొన్నారు.

ఎర్రబాబు ఆర్థిక సహకారంతో అన్నదానం

విశాలాంధ్ర - జగ్గంపేట : ఎన్టీఆర్ క్యాంటీన్ పేరుతో జగ్గంపేటలోని వారపు అన్నదాన సేవలు కీర్తిశేషులు ముండ్రు అప్పారావు, మంగయ్యమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు ముండ్రు ఎర్రబాబు ఆర్థిక సహకారంతో సోమవారం కొనసాగాయి. కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మల్లిసాల గ్రామానికి చెందిన కీర్తిశేష స్వర్గీయ ముందు అప్పారావు మంగయ్యమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు ముండ్రు కృష్ణారావు (ఎర్రబాబు) ముండ్రు జానకి రామారావు హార్దిక సహాయం చేశారని నవీన్ కుమార్ అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా వారానికి ఒకరు నాలుగు మండలాల పరిధిలోని నాయకులు ఆర్థిక సహకారంతో అన్నా క్యటీన్ సేవలు జరగుతున్నాయన్నారు. కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వీరబాబు, రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు కోర్పు సాయి తేజ, తెలుగు యువత అధ్యక్షులు దేవరపల్లి మూర్తి, క్లస్టర్ ఇంచార్జి పైడిపాల సూరి బాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, తూము కుమార్, భూపాలపట్నం ప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి గురు బ్రహ్మ అవార్డు

విశాలాంధ్ర - కొత్తపేట : స్థానిక విద్యా బాల మందిర్ ఉపాధ్యాయుడు కుసుమ సుధాకర్ గురుబ్రహ్మ అవార్డు పొందినట్లు కరస్పాండెంట్ ఆర్ అనురాధ తెలిపారు. గత పది సంవత్సరాలుగా విద్యా బాల మందిర్ హైస్కూలులో గణిత ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు. రాజమహేంద్రవరం ఎడ్యుకేషన్ సంస్థ గురు బ్రహ్మ అవార్డుతో సత్కరించారు. ఈ అవార్డును ఆదివారం రాత్రి రాజమహేంద్రవరం ఆనంద్ రిజెన్సీ ఫంక్షన్ హాలు నందు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆదిత్య విద్యా సంస్థలు డైరెక్టర్ యస్‌పి గంగిరెడ్డి, సత్యం కంప్యూటర్స్ వైస్ చైర్మన్ పి నాగరాజు, యన్‌యస్‌ఐఎల్ నరసింహ, రీజనల్ ఇన్స్పెక్టర్ ఆఫీసర్ రాజమహేంద్రవరం, డా పి విజయ్ భాస్కర్ చేతులమీదుగా అవార్డు, మేమెంటో, మెడల్ అందుకున్నారని తెలిపారు. ప్రధాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు సుధాకర్‌ను అభినందించారు.

దాడి కేసు నమోదు

విశాలాంధ్ర - కరప : కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన గురి మోహన్ కుమార్ (22) కరప మండలం, గురజనాపల్లి గ్రామంలో కోళ్ళ ఫారం ఉన్నదని, అక్కడ మోహన్ పుట్టిన రోజు సందర్భంగా తన స్నేహితులతో పార్టీ చేసు కుంటుండగా బిర్యానీ కోసం అని మోహన్‌కి వరుసకు తమ్ముడైన యాసలపు రోహిత్‌ను తూరంగి గ్రామం పంపి బిర్యాని తెమ్మని చెప్పగా రోహిత్ తీసుకుని వస్తుండగా 4వ తేదీ రాత్రి సుమారు 9.45 గంటలకు నడకుదురు ఆంజనేయస్వామి గుడి వద్దకు వచ్చేసరికి కొంతమంది దుండుగులు రోడ్డుకు అడ్డంగా ఉండి రోహిత్‌తో గొడవ పడగా విషయం తెలిసి ఫిర్యాది మోహన్, రోహిత్‌తో గొడవ పడిన నాగేంద్ర ఇంటికి వెళ్లి అడగగా, వంటలు చేసే కురుపీలతో మోహన్, రోహిత్‌కు గాయాలు కావడంతో మేజిస్ట్రేట్ అంశాలు పరిశీలించి కేసునమోదు చేశామని ఎస్సై సునీత పేర్కొన్నారు.

'స్వచ్ఛాంధ్ర 2025' అవార్డులు ప్రదానం

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : సోమవారం సాయంత్రం రాజమహేంద్రవరం పట్టణంలోని శ్రీ ఆనం వెంకటేశ్వర కళా కేంద్రంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 'స్వచ్ఛ ఆంధ్ర 2025' అవార్డుల జిల్లాస్థాయి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా సా సా నోడల్ అధికారిగా జాయింట్ కలెక్టర్ వై మేఘ స్వరూప్ కార్యక్రమాన్ని సమన్వయ కర్తగా వ్యవహరిం చారు. రాష్ట్ర,జిల్లా స్థాయిల్లో మొత్తం 21 క్యాటగిరిలలో స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ అవార్డులను ప్రకటించింది. ఇందులో తూర్పు గోదావరి జిల్లాకు రాష్ట్రస్థాయిలో మూడు కేటగిరీల్లో 3 అవార్డులు, జిల్లా స్థాయిలో 15 కేటగిరిల్లో 51 అవార్డులు లభించాయి.జిల్లాస్థాయి అవార్డులను ప్రదానం చేసే ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. అవార్డు గ్రహీతలకు గుర్తింపుతో పాటు సత్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర అవార్డులలో జిల్లాకు మూడు రాష్ట్ర స్థాయి, 51 జిల్లా స్థాయి అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు. స్వచ్ఛత అనేది దేశానికో, రాష్ట్రానికో చేసే సేవగా భావించకుండా.. మనకు మనం చేసుకునే సేవగా ప్రతిఒక్కరూ భావించాలన్నారు. అప్పుడే మన చుట్టూ

ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా మారి, ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కనుక మార్పు అనేది మన ఇంటి నుంచి, మన పిల్లల నుంచే మొదలు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాకు స్వచ్ఛతా అవార్డులు రావడం వెనుక పారిశుద్ధ్య కార్మికుల కృషి ఎంతో దాగుంది.. ఈ సందర్భంగా వారందరికీ అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ.. 2017 లో ప్రారంభమైన స్వచ్ఛ భారత్ మిషన్ దేశవ్యాప్తంగా ప్రతిఒక్కరిలో పెనుమార్పు తీసుకొచ్చిందన్నారు.సభాధ్యక్షులు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర అవార్డును అందుకున్న ప్రతిఒక్కరికీ ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. 2017 లో అప్పటి కూటమి ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన రాజ మహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఇవాళ రాష్ట్ర స్థాయి అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వ రరావు మాట్లాడుతూ.. ఆరోగ్యంపై మనం తీసుకునే జాగ్రత్తలతోనే రాబోయే రోజుల్లో మనం సంతోషంగా జీవించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర నిర్మాణానికి జరుగు తున్న యజ్ఞంలో అందరూ భాగస్వా ములు కావాలన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ (ఆర్డీవో) కార్యాలయానికి స్వచ్ఛ్ ఆంధ్రా 2025 ఉత్తమ అవార్డు కింద జిల్లాలో ఉత్తమ పరిశు భ్రమైన కార్యాలయంగా రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం గుర్తింపబడిన సందర్భంలో ఆర్.డి.ఓ ఆర్. కృష్ణ నాయక్ జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ , ఇతర ప్రజా ప్రతినిధులు సమక్షంలో అవార్డ్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు స్వచ్ఛ స్వచ్ఛ ఆంధ్ర అవార్డు గ్రహీతలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ సమాజ సాధన లక్ష్యం : కలెక్టర్

విశాలాంధ్ర - కాకినాడ : ఆరోగ్యం, ఆహ్లాదం వెల్లివిరిసే ఆదర్శ సమాజ సాధన లక్ష్యంగా స్వర్ణాంధ్రా-స్వచ్ఛాంధ్రా ఉద్యమాన్ని నిత్య జీవన సరళిగా నిరంతరం కొనసాగించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి జిల్లా ప్రజలను కోరారు. సోమవారం సాయంత్రం స్థానిక రాజాట్యాంక్ సమీపంలోని గోదావరి కళాక్షేత్రం ఆడిటోరియంలో కాకినాడ జిల్లా స్థాయి స్వచ్ఛా ఆంధ్రా-2025 అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని మున్సిపల్, పంచాయితీరాజ్ తదితర శాఖల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ముఖ్య అతిధిగాను, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ మున్సిపల్ కమీషనర్ భావన విశిష్ట అతిధులుగా హాజరై వివిధ కేటగిరిల క్రింద ప్రమాణిక సూచికల సాధనలో విశిష్ట ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో ఉత్తమంగా ఎంపికైన సంస్థలు, శాఖలు, వ్యక్తులకు స్వచ్ఛాంధ్ర 2025 అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం కాకినాడ జిల్లా రాష్ట్ర స్థాయిలో రెండు, జిల్లా స్థాయిలో 15 కేటగిరిలలో 50 అవార్డులు అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఇందుకు అంకితభావం, పోటీతత్వంతో కృషి చేసిన వారందరినీ ఆయన అభినందించారు. స్వచ్ఛతా లక్ష్యాల సాధనకు కృషి చేసిన వారిని అభినందిస్తూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ఉద్యమంలో మరింత మంది చురుకుగా పాల్గొనేందుకు స్వచ్ఛాంధ్ర అవార్డుల కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏటా నిర్వహిస్తోందన్నారు. ఈ సంవత్సరం సాధించిన అవారుల స్ఫూర్తితో వచ్చే సంవత్సరం మరిన్ని ఎక్కువ అవార్డులు సాధించేందుకు కృషి చేయాలని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంధ సంస్థలను జిల్లా కలెక్టర్ కోరారు. విశిష్ట అతిథి కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ స్వచ్ఛ వాతావరణంలో వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని, ఆరోగ్యమే వెలలేని భాగ్యమని తెలిపారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం గత జనవరి నెల నుండి ప్రతి 3వ శనివారం రాష్ట్రంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను ఉద్యమంలా నిర్వహిస్తోందన్నారు. స్వచ్ఛ సమాజ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమె కోరారు. కాకినాడ మున్సిపల్ కమీషనర్ భావన మాట్లాడుతూ స్వచ్ఛత, పరిశుభ్రతల్లో దైవత్వం ప్రతిబింబిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్, రాష్ట్ర

ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో కాకినాడ నగరం మంచి ర్యాంకులు సాధిస్తోందన్నారు. అనంతరం నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ముందుగా రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ) కేటగిరిలో అవార్డు అందుకున్న ఎలైట్ ఇన్స్ట్రుమెంట్స్ సంస్థను, స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్ కేటగిరిలో అవార్డు అందుకున్న డా బిఆర్ అంబేద్కర్ గురుకులం (బా), వెంకటాపురంలను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. 15 కేటగిరీలలో 50 జిల్లా స్థాయి అవార్డులకు ఎంపికైన వారికి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ అవార్డులు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డియంహెచ్ఓ డాజె నరశింహనాయక్, డిఈఓ పి రమేష్, ఆయూష్ వైద్యాధికారి డా అలీ, మెప్మా పిడి ప్రియంవద, జిల్లా ప్రజారవాణా అధికారి ఎం శ్రీనివాసరావు, కాకినాడ ఎడిసి సుధాకర్, స్వచ్ఛంధ సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. వెంకన్న కల్యాణం...

విశాలాంధ్ర, ద్వారకాతిరుమల: ద్వారక తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి కనుల పండుగగా జరిగింది. పద్మావతి. ఆండాళ్ అమ్మవార్లను శ్రీవేంకటేశ్వరస్వామి పరిణయ మాడిన ఘట్టం భక్తులకు నేత్రపర్వమైంది. తొలుత ఆలయం తూర్పు వైపున అనివేటి మండపంలో కల్యాణ వేదికను ఏర్పాటు చేసి రంగు రంగుల పచ్చిపూలతో భక్తులను ఆకట్టుకునేలా అందంగా అలంకరించారు. కల్యాణ ఉత్సవాల్లో భాగంగా పెండ్లి కుమారుడు, పెండ్లికుమార్తెలుగా ముస్తాబైన స్వామి, అమ్మవార్లను ఆలయం వద్ద నుంచి వేరు వేరువాహనాలపై కల్యాణ మండపం వద్దకు తోడ్కొని వచ్చారు. ఈ మండపంలో స్వామి అమ్మవార్లను వధూవరులుగా కొలువుతీర్చారు.



స్వామివారికి, అమ్మవార్లకు వర పూజ జరిపించి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు,ఆలయ అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఈవో ఎన్ వి ఎస్ ఎన్ మూర్తి చేతులు మీదుగా పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామి, అమ్మవా ర్లకు పట్టు వస్త్రాలు అలంకరించి మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ కల్యాణ క్రతువును నిర్వహించారు. వేద పండితులు వేద మంత్రాలు చదువుతూ ముహూర్త సమయంలో జీలకర్రబెల్లం మిశ్రమాన్ని స్వామి, అమ్మవార్ల శిరస్సుపై అర్చక స్వాములు అలంకరించారు. ముహూర్త సమయంలో జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. సింహవాహనంపై స్వామివారి గ్రామోత్సవం తిరుకల్యాణమహోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సింహ వాహనంపై స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పండితులు స్వామివారికి హారతులు పట్టి ఉత్సవాన్ని ప్రారంభించారు. మేళతాళాలు, వేద మంత్రాల నడుమ ఈ ఉత్సవం కన్నుల పండువగా సాగింది. మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో కర్పూర హారతులతో నీరాజనాలు పలికారు. విద్యుద్దీపకాంతుల నడుమ స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని భక్తులు దర్శించి తరించారు. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివారు మోహిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలి : బండి

విశాలాంధ్ర- ఏలూరు: గత ఐదు దశాబ్దాలుగా జంగారెడ్డిగూడెం మండలం కేతవరం సీలింగ్ భూమి పట్టాదారులుగా ఉన్న దళిత పేదలను ఆ భూములలోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్న జంగారెడ్డిగూడెం తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలని బికేయంయు ఏలూరు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ను కోరారు.సోమవారం బికేయంయు, సీపీఐ నాయకులు కేతవరం భూ సమస్యపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను కలిశారు. 1975లో ల్యాండ్ సీలింగ్‌లో 67 ఎకరాల భూమిని 66 మంది పేద దళితులకు ప్రభుత్వం పట్టాలిచ్చిందని పేర్కొన్నారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌లో భూములు కోల్పోయిన భూస్వామి బినామీ కౌలు దారులను సృష్టించి అసైన్ పట్టాదారులపై ఎల్ఆర్ఎటీ కోర్టులో దావా వేయగా కోర్టు అసైన్డ్ లబ్దిదారులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. తర్వాత భూస్వామి హైకోర్టులో అప్పీల్ చేయగా మూడవ పార్టీగా అసైన్డ్ లబ్ధిదారులు కోర్టును ఆశ్రయించారని తెలిపారు. కొద్ది రోజుల్లోనే హైకోర్టులో కూడా తీర్పురానున్నదని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ప్రభుత్వ పట్టాలు పొందిన లబ్దిదారులు భూముల్లోకి వెళ్లి సాగు చేస్తుంటే తహసీల్దార్ పోలీసులను పంపించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వివరించారు. పేద దళితులకు న్యాయం చేయవలసిన రెవెన్యూ అధికారి అయిన తహసీల్దారు పేదలకు వ్యతిరేకంగా ప్రవర్తించడం సరైనది కాదన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను కలిసిన వారిలో బికేయం యు జిల్లా సహాయ కార్యదర్శి గోలిమే బాలయేసు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జేవీ రమణ రాజు, కేతవరం దళితులు మంచాల ప్రభాకర్, ముప్పిడి రత్తయ్య, తళ్లూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ జయప్రదం చేయాలని ర్యాలీ

విశాలాంధ్ర - ఆగిరిపల్లి : ఉపాధ్యాయుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల సాధనకై నేడు ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గం తలపెట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమానికి సంఘీభావంగా ఆగిరిపల్లి మండలంలోని ఫ్యాప్టో (ఎస్టీయూ, యూటీఎఫ్) సంఘాలు స్థానిక హై స్కూల్ సెంటర్ నుంచి స్టేట్ బ్యాంక్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆగిరిపల్లి మండల ఫ్యాప్టో కన్వీనర్లు మక్కే వేణుగోపాలరావు, కలపాల అజరయ్యలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు కావస్తున్న పెండింగ్‌లోవున్న నాలుగు డిఏలను విడుదల చేయడం, పీఆర్సీ కమిటీని నియమించడం, ఐఆర్‌ను ఇవ్వడం ఇంతవరకు చేయలేదని 30 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసులను క్రమబద్ధీకరించడంలో చొరవ చూపలేదని వాటిని తక్షణమే పరిష్కరించి ఉపాధ్యాయులకు ఊరట కల్పించాలని కోరారు. అనంతరం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు తాడి నరసింహారావు, ఉమ్మడి జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి చౌటపల్లి సురేష్ కుమార్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు, యాప్‌ల భారం తగ్గించాలని, ఎంటిఎస్ ఉపాధ్యాయుల సర్వీసును క్రమబద్ధీక రించి వారి రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచాలని, పెండింగ్ మెడికల్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి మండల ఫ్యాప్టో నాయకులు అంకం వెంకటేశ్వరరావు, తాడి ప్రసాద్, జలసూత్రం వెంకటేశ్వరరావు, యుఆర్‌కే రాజు, ఎస్ఎ విఠల్, ఆర్ సాంబశివరావు, కే ప్రభాకర్‌రావు, కే కోటేశ్వరరావు, కే రవి, జె రామకృష్ణ, టి బాలస్వామి, జి సుధీర్ బాబు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగింపు అనంతరం సోమవారం దేవరపల్లి బాలదుర్గమ్మ అమ్మవారిని భారీ స్థాయిలో ఊరేగింపు నిర్వహించారు. బాలదుర్గమ్మ ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు అనంతరం బాలదుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగింపు ప్రారంభించారు వాహనాన్ని ప్రత్యేకంగా అలంకరించారు దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ కోశాధికారి కామిశెట్టి దుర్గారావు కమిటీ సభ్యులు ఊరేగింపు ప్రారంభించారు మేళతాళాలతో బాణసంచాలతో తీన్మార్ వాయిద్యాలతో గరగ నృత్యాలతో అంగరంగ వైభవంగా ఊరేగింపు కొనసాగింది బాలదుర్గమ్మ ఆలయం నుండి చంద్రబాబు నాయుడు కాలనీ పల్లపు వీధి సొసైటీ మెయిన్ రోడ్ గోపాలపురం సెంటర్ మెరకవీధి నిమ్మలపాటి దిబ్బ వీధి బీసీ కాలనీ కృష్ణుడి ఆలయం యాదవోలు రోడ్డు కుండా ఊరేగింపు కొనసాగింది ఊరేగింపులు యువకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు బాలదుర్గమ్మ ఆలయానికి దేవి నవరాత్రి ఉత్సవాల్లో సేవలందించిన వారిని ఎంపీపీ కెవికె దుర్గారావు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు ముఖ్యంగా దేవుని నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించిన సుతాపెల్లి అపర్ణ రామారావు దంపతులను సత్కరించారు ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ కోశాధికారి కామిశెట్టి దుర్గారావు కమిటీ సభ్యులు గారపాటి అప్పారావు పెన్నమ్మని వెంకటకృష్ణ పైడికొండల శివయ్య పైడికొండల వెంకటేశ్వరరావు జాజిమొగ్గల శ్రీనివాస్ రౌతు అప్పారావు కామిశెట్టి ధర్మరాజు పైడికొండల బుల్లయ్య కామిశెట్టిమాణం మాతు సీత తదితరులు ఆలయం వద్ద జరిగిన కార్యక్రమాలు పాల్గొన్నారు ఊరేగింపు సందర్భంగా అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

తాడేరు సొసైటీ చైర్మన్‌కు సత్కారం

విశాలాంధ్ర - భీమవరం : తాడేరు సహకార బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కొట్టు సురేష్‌ను కృష్ణ బలిజ పూసల వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్టు సురేష్ ప్రజా సేవలో విశేష అనుభవం ఉందని కొనియాడారు. ఆయన నేతృత్వంలో తాడేరు సొసైటీ బ్యాంక్ మరింత అభివృద్ధి సాధిస్తుందని తన పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. కొట్టు సురేష్ నాయకత్వంలో సొసైటీ సభ్యులకు, స్థానిక ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో తాడేరు సొసైటీ డైరెక్టర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు యలమంచిలి శ్రీనివాసరావు, విన్న కోట వినయ్, కాపా అమర్ బాబు, మద్దుల సాయిరాం, గోలగాని దుర్గారావు తో పాటు స్థానిక నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొట్టు సురేష్ కి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : మండలం లోని రాచన్న గూడెం గ్రామంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో భాగంగా సోమవారం రాచ్చన్న గూడెం గ్రామంలో కూటమి నాయకులు ఆటోడ్రైవర్లతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం 15,000 రూపా యలను తమ ఖాతాలో జమ చేసినందుకు అభినందనలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వంలో ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం తమ కుటుంబాలను ఆదుకుందన్నారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు పులుమోలు శివాజీ. పూసమ్ ఉదయ్, కుమార్. పేరు బోయిన దాము. తోట పండు. నట్టే వెంకటేశ్వరరావు. సాదు కిషోర్. జక్కుల వెంకటేష్. కుమ్మరపల్లి రాంబాబు. గౌడుగుల కిరణ్. కొప్పుల కార్తీక్. వీరమల్ల శ్రీను. నట్టే మహేశ్వరరావు. ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కోనసీమ తిరుమల వాడపల్లిలో శ్రీవెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - అమలాపురం : కోనసీమ తిరుమల వాడపల్లిలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 10వ తేదీ నుండి 18వ తేదీ వరకు అత్యంత వైభవో పేతంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఉత్సవ కమిటీ సభ్యులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహణ ఏర్పాట్లపై అధి కారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పూర్తిస్థాయి లో భక్తు లకు ఉత్సవాలకు అనుగుణంగా ఏర్పాటు చేస్తూ ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ముందస్తు చర్యలు గైకొనాలన్నారు. ఈనెల 11వ తేదీ 18వ తేదీలు శనివారం సందర్భంగా భక్తుల తాకిడి అధి కంగా ఉండే అవకాశం ఉన్నదని ఆస్థాయిలో పార్కింగ్ బందోబస్తు ఏర్పాట్లు రెండు రేవుల వద్ద సెక్యూరిటీ పరంగా చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు. ఈ నెల 10వ తేదీ శేష వాహన సేవ 11వ తేదీ హంస వాహన సేవ 12వ తేదీ హనుమ ద్వాహన సేవ 13వ తేదీ సింహ వాహన సేవ 14వ తేదీ గరుడ వాహన సేవ 15వ తేదీ ఉదయం సూర్యప్రభ వాహన సేవ సాయంత్రం చంద్రప్రభ వాహన సేవ 16వ తేదీ రాజాధిరాజ అలంకరణతో గజవాహన సేవ 17వ తేదీ ఉదయం కల్పవృక్ష వాహన సేవ సాయంత్రం అశ్వవాహన సేవ, 18వ తేదీ చివరి రోజు చక్రస్నానం కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ భక్తులకు ఎటు వంటి అవసరం లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య వ్యవస్థ కొరకు కార్మికులను అవసరాల మేరకు నియమించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ బస్సుల రాకపోకలు ద్విచక్ర వాహనాలు పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కళావేదిక వరకు బస్సులను నడపాలన్నారు. క్యూ లైన్లు భక్తుల దర్శన ఏర్పాట్లపై పటిష్ట చర్యలు గైకొనాలన్నారు. భక్తులు క్యూ లైన్‌లలో ఎక్కువ సమయం నిరీక్షించకుండా శీఘ్ర దర్శనం కొరకు ఏర్పాట్లు గావించాలన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట రాజు, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధర్ రావు, డిఎస్‌పి మురళీ మోహన్, ఆర్డీవో పి.శ్రీకర్, తహశీల్దార్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల పరిరక్షణలో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : వన్య ప్రాణుల పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి సునీత అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏలేశ్వరం అటవీ శాఖ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వన్యప్రాణుల వారోత్సవంలో భాగంగా అవగాహన కార్యక్ర మం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కళాశాల ప్రిన్సి పల్ సునీత హాజరై విద్యార్థు లను ఉద్దే శించి మాట్లాడారు. భారత దేశంలోని వృక్షజాలం, జంతుజాలాన్ని రక్షించడం, పరిరక్షిం చడంపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ వారోత్సవాల ప్రధాన ఉద్దేశ్యమని భూమిపై మానవ జాతి సుఖ సంతోషాలతో జీవించాలంటే మనతో పాటు అన్నీ జీవజా తులు జీవించాలని కోరారు. పోచింగ్, బయోపైరసీ, అడవి ఉత్పత్తుల అక్రమ వ్యాపారం వంటివి జీవ జాతుల క్షీణతకు కారణమవు తున్నాయని వాటిని అరికట్టే ప్రయత్నంలో అం దరూ భాగస్వాములు కావాలని కోరారు. మొక్కలు నాటితే అన్నీ జీవజాతులకు ఆహారం సర ఫరా చేసినట్టేనని తెలియజే శారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎం జాన్ మాట్లాడుతూ ఎక్కడై నా జంతువులకు హాని తలపెట్టినట్లైతే వెంటనే సంబంధిత అటవీ శాఖ అధికారు లకు సమాచారం ఇవ్వాలని అది మన భాధ్యతగా భావించి జీవరాశుల మనుగడకు బాట లు వేయాలని కోరారు. వన్య ప్రాణుల సంరక్షణ అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వ హించి గెలుపొందిన కిలాడి అఖిల, పెద్ద దుర్గాకు ప్రిన్సిపల్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.వేంకటేశ్వర రావు జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి డా ప్రయాగ మూర్తి ప్రగడ, అధ్యాపకులు కె సురేష్, డా మదీనా, డా శివ ప్రసాద్, శ్రీలక్ష్మి, వీరభద్ర రావు, డా బంగార్రాజు, సతీశ్, మేరీ రోజలీనా, పుష్పా, రాజేష్ అటవీ శాఖ సిబ్బంది మీనాక్షి, కె అప్పలకొండ, కె శ్రీనివాస రావు, శేఖర్ బాబు, కె శివ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కమ్యూనిటీ ఎఆర్‌టి రిఫిల్లింగ్ గ్రూప్ కార్యక్రమం

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : స్థానిక రమణయ్యపేట చెంజెస్ స్వంచ్ఛంద సంస్థ భవనంలో కమ్యూనిటీ ఎఆర్‌టి రిఫిల్లింగ్ గ్రూప్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ టిబి అధికారి డాక్టర్ ఎస్ చలమయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ సూచనలు మేరకు ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ప్రారంభించడం జరిగిందని చెప్పారు. కమ్యూనిటీకి చెందిన హెచ్ఐవి వ్యాధిగ్రస్తులై నిస్సహాయస్థితిలో ఉన్న మహిళలకు, ట్రాన్స్‌జెండర్లకు అనుకూలమైన వాతావరణం ఉండేవిధంగా చూడా లని సూచించారు. మందులు వాడేవాళ్లకు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళే శ్రమ తగ్గుతుం దన్నారు. కొంత మేర ఛార్జీలు కూడా కలసివస్తాయని అన్నారు. అన్ని కమ్యూనిటీ సభ్యులు అందరూ కూడా ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకుని తమ తమ ఆరోగ్యాన్ని కాపాడుకో వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి బాలాజీ, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్, క్లస్టర్ ప్రివెన్షన్ ఆఫీసర్ జి రామానాయుడు, ఎఆర్‌టి సెంటర్ డా ఐ రత్నమణి, వైద్యాధికారి, సి చంద్రమౌళి, షేర్ ఇండియా పిఓ మరియు చేంజెస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రాజెక్ట్ మేనేజర్ పి దుర్గ భవాని, క్రైసిస్ కమిటీ సభ్యులు బి రామలింగాశర్మ, అకౌంటెంట్ శివా, ఏయన్‌యం సునీత, నాగదుర్గ, నారాయుడు, సరోజ, గాయత్రి, సుశీల మరియు కమ్యూనిటీ మెంబెర్స్ పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : స్థానిక చత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ డా. ఎన్. ప్రసాద్ బాబు అధ్యక్షతన వాణిజ్య శాస్త్రము మరియు అర్థశాస్త్ర విభాగంల ఆధ్వర్యంలో సోమవారం సూపర్ జి ఎస్ టి పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. ఎన్.ప్రసాద్ బాబు మాట్లాడుతూ జి ఎస్ టి 2.0 వల్ల అనేక రకాల వస్తువులపై పన్ను రేట్లు తగ్గుతున్నాయని వీటిపై మనం తెలియని వారికి అవగాహన కల్పించాలని జీఎస్టి వల్ల అనేక వస్తువులకు అనేక రకాల పన్నులు చెల్లించాల్సిన అవసరం లేకుండా ఒక దేశము ఒకే పన్ను విధానం అమలులోనికి వచ్చిందని ఒకే పన్ను విధానం వల్ల తెలియని వారికి సైతం అర్థం చేసుకోవడం సులభం అయిందని మరలా ఆ పన్నులను కూడా తగ్గించి రెండే రకాల 5% 18 % పన్నులు మాత్రమే ఈ 2.0 లో ఉన్నాయని వీటిని అర్థం చేసుకోవడం చాలా సులభమని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ అర్థశాస్త్ర విభాగ అధిపతి బి శ్రీనివాసరావు మాట్లాడుతూ జీఎస్టీ 2.0 వల్ల కలిగే ఉపయోగాలను గురించి తెలియని వారికి అవగాహన కల్పించాలన్న ఉద్దేశం తోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని జి ఎస్ టి సూపర్ సేవింగ్ వల్ల వస్తువులపై జి ఎస్ టి ఏ విధంగా తగ్గుతుంది మనం ఎంతవరకు వ్యయాలను తగ్గించుకొని సేవ్ చేసుకోగలము అనే అంశంపై సమాజానికి, వ్యాపారస్తులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగ అధిపతి డా.కే. ఉత్తమ్ సాగర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో విద్యార్థులకు ఏ వస్తువులపై జి ఎస్ టి రేట్లు ఎంత శాతం తగ్గాయో వివరించారు. దీనితోపాటు జీఎస్టీ నుంచి మినహాయింపు పొందిన వస్తువులు, 40% జి ఎస్ టి విధించే వస్తువులు, 3% జిఎస్‌టి విధించే వస్తువులను గురించి కొన్సెడింగ్ ప్రభావం జి ఎస్ టి వల్ల తగ్గుతుందని వివరించారు. కళాశాల ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ ఎమ్. మధు మాట్లాడుతూ ప్రభుత్వం నాలుగు రేట్ల జి ఎస్ టి విధానాన్ని రెండు రేట్ల జిఎస్‌టికి కుదించినందుకు వస్తు సేవలపై వినియోగదారుని కి పన్ను భారం తగ్గుతుందని దీనిపై మనం వినియోగదారులందరికీ అవగాహన కల్పించాలని అన్నారు. వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు సిహెచ్. రమాదేవి మాట్లాడుతూ జి ఎస్ టి సవరణ బిల్లును గురించి, 2017 లో ప్రవేశపెట్టిన జి ఎస్ టి విధానానికి సూపర్ సేవింగ్ జి ఎస్ టి కి ఉన్న తేడాలను గురించి వివరించారు. అర్థశాస్త్ర అధ్యాపకులు వి. హనుమంతరావు మాట్లాడుతూ ఇప్పటినుంచి మనం కొనుగోలు చేసే ప్రతి వస్తువుపై విధించే జి ఎస్ టి ని గతంలో కొనుగోలు చేసిన వస్తువుల పై విధించిన జి ఎస్ టి రేట్లకు ఉన్న తేడాను గమనించి తెలియని వారికి తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు డా. సిహెచ్. బదిరీ నారాయణ, డా. జి. శ్రీనివాసరావు, టీ వి రాంబాబు, డా.పి సన్యాసిరావు, బి. అశోక్, కే వి వి శిరీష ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.